RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | శుక్రవారం 23-10-2026 | సంచిక: 13 | సంఖ్య: 364 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి




## రైతుకు అండగా నిలవడంలో కాంగ్రెస్ వైఫల్యం

- 12 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం.. హరీశ్ రావు ఆరోపణ
- రాష్ట్రవ్యాప్తంగా 10 నుంచి 12 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వెల్లడి
- ఎకరాకు 2--3 క్వింటాళ్ల పత్తి కూడా వచ్చే పరిస్థితి లేదని విమర్శ
- ముందస్తు హెచ్చరికలు ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపణ
- కరువు మండలాల ప్రకటన, రైతులకు ఆర్థిక సాయం ఏదని ప్రశ్న



2

## ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబరు 1న ఎన్నికలు..

- ఆంధ్రప్రదేశ్‌లో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల
- నవంబర్ 1న పోలింగ్, 3వ తేదీన ఓట్ల లెక్కింపు
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం నిర్ణయం
- కడప, తిరుపతి సహా నాలుగు చోట్ల తిరిగి నామినేషన్లకు అవకాశం



2

## నిరసనతో సంబంధం లేదు".. ఢిల్లీ హైకోర్టులో నేహా బోరా..

- సీజేపీ నిరసనతో సంబంధం లేదన్న నేహాబోరా..
- వ్యక్తిగత బాండ్ నోటీసుల్ని ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన నేహా..



2

# పరిషత్ ఎన్నికలపై చంద్రబాబు, పవన్ చర్చలు

- సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో భేటీ
- నామినేషన్లకు అదనపు గడువుపై సమాలోచనలు
- కూటమి అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాటుపై దృష్టి
- ఎస్ఈసీ తదుపరి నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమావేశమై చర్చించారు. నామినేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇచ్చిన సూచనల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ, కూటమి పార్టీల కార్యాచరణపై సమాలోచనలు జరిపారు. ఈ భేటీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.

- మిగతా 2వ పేజీలో





## భారత్‌తో కలిసి పని చేయండి

- పోలాండ్ కంపెనీలకు ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం
- పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో భేటీ
- కీలక రంగాల్లో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని నిర్ణయం

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న అస్థిరత, భౌగోళిక రాజకీయాల్లో మార్పుల నేపథ్యంలో రక్షణ, అంతరిక్షం, అణుశక్తి రంగాల్లో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని భారత్, పోలాండ్ నిర్ణయించుకున్నాయి. ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ, పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ అంగీకారానికి వచ్చారు. ఇరువురు నేతలు గురువారం ఢిల్లీలో సమావేశమయ్యారు. భారత్, పోలాండ్ సంబంధాల్లో పురోగతిపై చర్చించారు.

- మిగతా 2వ పేజీలో

# బీసీలకు సామాజిక న్యాయమే లక్ష్యం

- బలహీనవర్గాలకు సమాన అవకాశాలు
- బీసీ కులగణనలో పొరపాట్లుంటే సరిచేస్తామని సీఎం ప్రకటన
- ముదిరాజ్‌ల వర్గీకరణ అంశాన్ని న్యాయపరంగా పరిశీలించాలని సూచన
- సాయన్న జయంతి, వర్ధంతి అధికారిక నిర్వహణకు నిర్ణయం
- ట్యాంక్‌బండ్ సమీపంలో సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలు



హైదరాబాద్: సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయ, సామాజిక రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన పలు అంశాలపై మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల జనాభా వివరాలను సేకరించేందుకు తమ ప్రభుత్వం కులగణన నిర్వహించిందని సీఎం తెలిపారు. ఈ ప్రక్రియలో ఏదైనా కులానికి చెందిన జనాభా తక్కువగా నమోదైందని భావిస్తే, సంబంధిత వివరాలను ప్రభుత్వానికి అందించాలని సూచించారు. నమోదులో చోటుచేసుకున్న పొరపాట్లను పరిశీలించి సరిదిద్దుతామని, జాబితాలోకి రాని వారిని చేర్చే అంశాన్నీ పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

- మిగతా 2వ పేజీలో

## ప్రజాస్వామ్యం కోసం వెనక్కి తగ్గొద్దు: జగన్

- ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం.. ఎంతదూరమైనా వెళ్తాం: జగన్
- ఎన్నికల్లో హింసపై పోరాటం.. వైసీపీ నేతలకు జగన్ దిశానిర్దేశం
- ప్రభుత్వంపై హింస, అక్రమాలకు సంబంధించి జగన్ ఆరోపణలు
- సుప్రీంకోర్టు ఆదేశాల అమలుపై పార్టీ అధినేత అసంతృప్తి
- ఘటనల వివరాలను సేకరించి న్యాయస్థానాలను ఆశ్రయించాలని సూచన

2






# ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం

- హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన అలయ్ బలయ్ వేడుకలు
- ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించిన వెంకయ్యనాయుడు
- రాజకీయాలకు అతీతంగా హాజరైన వివిధ పార్టీల నేతలు
- 'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' ఇతివృత్తంతో కార్యక్రమం

ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ అనంతరం హర్యానా మాజీ గవర్నర్

## 2028లో తెలంగాణలో కాషాయ సునామీ..

- కేటీఆర్ గడ్డంపై బీజేపీ ఎంపీ వ్యంగ్యాస్త్రాలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పొత్తు చర్చలు సాగుతున్నాయని ఆరోపణ
- రేవంత్‌ను సీఎం పదవి నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎంపీ అర్వింద్ వ్యాఖ్య
- పొత్తులు లేకుండానే అధికారంలోకి వస్తామని ధీమా

నిజామాబాద్: రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విశ్వాసం వ్యక్తం చేశారు. 2028 ఎన్నికల్లో రాష్ట్రంలో కాషాయ ప్రభంజనం

- మిగతా 2వ పేజీలో



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

## ప్రజాస్వామ్యం కోసం వెనక్కి తగ్గొద్దు: జగన్

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా హింస, అక్రమాలు జరుగుతున్నాయన్న అంశంతో పాటు సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయస్థానాలను ఆశ్రయిస్తూ పోరాటాన్ని కొనసాగించాలని నాయకులకు సూచించారు. ఎన్నికల సమయంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక పరిణామాల వెనుక చంద్రబాబు ప్రభుత్వ ఉద్దేశపూర్వక చర్యలు ఉన్నాయని జగన్ ఆరోపించారు. ప్రభుత్వాన్ని నడిపించే వారే హింసకు పాల్పడుతున్నారని విమర్శించారు. పోలీసులను ఉపయోగించుకుని ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారని చంద్రబాబుపై ఆరోపణలు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు వచ్చినప్పటికీ పరిస్థితులు మెరుగుపడలేదని సమావేశంలో ప్రస్తావించారు. క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న పరిస్థితులను సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వైసీపీ శ్రేణులు ధైర్యంగా నిలబడుతున్నాయని జగన్ అభినందించారు. ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకునే ప్రతి ఘటనను గమనిస్తూ, సంబంధిత వివరాలను సేకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కోర్టుల్లో తమ వాదనలకు బలం చేకూర్చేలా ఆధారాలను సేకరించాలని జగన్ సూచించారు. ఘటనలకు సంబంధించిన వివరాలను క్రమబద్ధంగా భద్రపరచి, వాటిని న్యాయస్థానాల ముందు ఉంచాలని చెప్పారు. ఆరోపణలను ఆధారాలతో సహా న్యాయపరంగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు ప్రయత్నించాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ విషయంలో వెనుకడుగు వేయకూడదని జగన్ స్పష్టం చేశారు. అవసరమైతే ఎంతదూరమైనా వెళ్లి న్యాయపోరాటం కొనసాగిద్దామని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల పరిణామాలపై అప్రమత్తంగా ఉంటూ, క్షేత్రస్థాయి నుంచి అందే సమాచారాన్ని సేకరించి తదుపరి చర్యలకు సిద్ధం కావాలని సూచించారు.

## బీసీలకు సామాజిక న్యాయమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

కులగణనను ఏడాది వ్యవధిలో పూర్తిచేయడం ద్వారా బీసీల జనాభా వివరాలను తొలిసారిగా లెక్కల్లోకి తీసుకొచ్చామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశంపై వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చించి, లెక్కలను మరింత పక్కాగా రూపొందించేందుకు అవసరమైన చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బలహీనవర్గాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని, అవకాశం ఉంటే తన చుట్టూ ఆ వర్గాల వారిని కూర్చోబెట్టుకోవాలన్నదే తన అభిమతమని అన్నారు. ముదిరాజ్ సామాజికవర్గాన్ని ప్రస్తుతం ఉన్న బీసీ–డీ జాబితా నుంచి బీసీ–ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పై సీఎం స్పందించారు. ఈ అంశానికి సంబంధించి ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, చట్టపరంగా ఉన్న మార్గాలను తెలుసుకోవాలని సూచించారు. గంగపుత్ర సామాజికవర్గంలో ఈ విషయంపై నెలకొన్న అపోహలను కూడా గుర్తించాలని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ వర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకూ భవిష్యత్తులో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తన పనితీరును ప్రస్తావించిన రేవంత్ రెడ్డి, తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకునే రకం తాను కాదని చెబుతూ, పరోక్షంగా గత ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శలు చేశారు. పండుగ సాయన్న సేవలను గుర్తిస్తూ ఆయన జయంతి, వర్ధంతి వేడుకలను ఇకపై అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సీఎం ప్రకటించారు. సాయన్న కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ట్యాంక్‌బండ్ సమీపంలో పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీసీల జనాభా లెక్కల సవరణ నుంచి సామాజికవర్గాలకు అవకాశాల కల్పన వరకు పలు అంశాలపై సీఎం చేసిన ప్రకటనలు కార్యక్రమంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## నిరసనతో సంబంధం లేదు".. ఢిల్లీ హైకోర్టులో నేహా బోరా..

కాక్రోచ్ జనతా పార్టీ (జబీూ) నిరసన పిలుపుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరా ఢిల్లీ హైకోర్టుకు తెలిపారు. అక్టోబర్ 16న తనను అదుపులోకి తీసుకున్న తర్వాత రూ. 10 వేల వ్యక్తిగత బాండ్ సమర్పించి శాంతిభద్రతలను కాపాడాలని ఆదేశిస్తూ జారీ చేసిన నోటీసులు ఆమె ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు. నేహాబోరా తరుఫున న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపించారు. నేహాబోరా ఎలాంటి నేరాలకు పాల్పడలేదని, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యల్లో పాల్గొనలేదని ఆయన కోర్టుకు తెలిపారు. హింసను ప్రేరేపించేలా ఆమె ఎలాంటి పిలుపుఇవ్వలేదని వాదించారు. అక్టోబర్ 16న తిరంగా యాత్ర సమయంలో మండీ హౌజ్ వద్ద నేహా బోరాను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరుసటి రోజు విడుదలైన ఆమెకు అక్టోబర్ 18న ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (రాజువీ) నుంచి నోటీసు అందింది. రూ.10 వేల వ్యక్తిగత బాండ్ సమర్పించాలని, శాంతిభద్రతలను కాపాడాలని అందులో ఆదేశించారు. జంతర్ మంతర్‌ను అధికారికి నిరసన స్థలం నుంచి తొలగించినప్పటికీ, ఆంక్షలు ఉన్నప్పటికీ ప్రజల్ని కన్నాట్‌ప్లేస్ వైపు వెళ్లేలా నేహా బోరా ప్రేరేపించారని నోటీసుల్లో ఆరోపించారు. అయితే, నేహా బోరాను మండీ హౌజ్ చేరుకున్న 10–15 నిమిషాల్లోపే అదుపులోకి తీసుకున్నారని ఆమె న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఆ రోజు శాంతిభద్రతలకు భంగం కలిగిచేలా ఎలాంటి చర్యలకు పాల్పడలేదని వాదించారు.

## ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబరు 1న ఎన్నికలు..

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 1న పోలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ఇటీవల నామినేషన్ల పర్వంలో వివాదాలు తలెత్తిన నేపథ్యంలో కడప, తిరుపతి కార్పొరేషన్లతో పాటు రాజంపేట, మైదుకూరు మున్సిపాలిటీలలోని కొన్ని వార్డులకు సంబంధించి తిరిగి నామినేషన్లు స్వీకరించాలని ఈసీ నిర్ణయించింది. ఈ నాలుగు పట్టణాల పరిధిలో అక్టోబర్ 23, 24 తేదీల్లో మళ్లీ నామినేషన్లు స్వీకరించనున్నట్లు పునేఠా తెలిపారు. అక్టోబర్ 25న నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి, అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారని వివరించారు.

# భారత్‌తో కలిసి పని చేయండి

(మొదటి పేజీ తరువాయి)



అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. డొనాల్డ్ టస్క్ తో భేటీ అనంతరం మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన పాలనను తమ రెండు దేశాలు సంపూర్ణంగా విశ్వసిస్తున్నాయని తెలిపారు. ఉక్రెయిన్‌తోపాటు పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు జరిగే ప్రతి ప్రయత్నానికీ మద్దతు ఇస్తున్నామని తెలియజేశారు. భారత్, పోలాండ్ మధ్య రక్షణ, అంతరిక్షం, అణుశక్తి రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసు కోవాలని నిర్ణయించామని చెప్పారు. ఆయా వ్యూహాత్మక రంగాలన్నింటిలోనూ భారత్‌తో కలిసి పనిచేయాలని, అభివృద్ధి, ఉత్పత్తిలో పాలుపంచుకోవాలని పోలాండ్ కంపెనీలను మోదీ ఆహ్వానించారు. కీలక ఖనిజాలు, బొగ్గుతో సహజ వాయువు ఉత్పత్తిలో పోలాండ్ నైపణ్యాన్ని ఉపయోగించుకుంటామని వివరించారు.

### భాగస్వామ్యానికి కొత్త అవకాశాలు

భారత్, పోలాండ్ దేశాల మధ్య స్నేహం కేవలం దౌత్య సంబంధాలపైనే కాకుండా.. మానవత్వం, కరుణ అనే ఉమ్మడి వారసత్వంపై ఆధారపడి ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జామ్‌నగర్, కొల్హాపూర్ రాజ కుటుంబాలు వేలాది మంది పోలాండ్ పిల్లలకు, కుటుంబాలకు భారతదేశంలో ఆశ్రయం కల్పించాయని గుర్తుచేశారు. 2022లో ఉక్రెయిన్ నుంచి భారత విద్యార్థులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి రావడానికి పోలాండ్ సహకారం అందించిందని అన్నారు. మానవతా స్ఫూర్తిని చాటుకుందని కొనియాడారు. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న ఆర్థిక సంబంధాల గురించి మోదీ ప్రస్తావించారు. ప్రపంచం ప్రస్తుతం అనిశ్చితిని ఎదుర్కొంటోందని చెప్పారు. ఇలాంటి సమయంలో కూడా భారత్, పోలాండ్ దేశాలు వృద్ధి, సాంకేతికత, ఆవిష్కరణలకు ముఖ్యమైన కేంద్రాలుగా ఎదుగుతున్నాయని హర్షం వ్యక్తంచేశారు. రెండు దేశాల ఆర్థిక బలం నానాటికీ పెరుగుతోందని వెల్లడించారు. తద్వారా భారత్––పోలాండ్ భాగస్వామ్యానికి కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలియజేశారు. భారత్––యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈ అవకాశాలను మరింత విస్తరించిందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత భారతదేశం నుంచి పోలాండ్‌కు ఎగుమతులు భారీగా పెరుగుతాయని మోదీ స్పష్టంచేశారు. రైల్వేలు, రవాణా, తయారీ, ఆహార శుద్ధి, బయోటెక్ వంటి రంగాల్లో పోలాండ్ నుంచి కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తామని తెలిపారు.

## ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం

(మొదటి పేజీ తరువాయి)



బండారు దత్తాత్రేయ సారథ్యంలో ఈ సాంస్కృతిక సమ్మేళనం జరుగుతోంది. ఈ వేడుకలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, లౌకిక దేశంలో ఏ మతాన్ని, పండుగను తక్కువ చేసి చూడకూడదని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' సాధనను దేశ ప్రజలందరూ తమ ఉమ్మడి జాతీయ లక్ష్యంగా మలుచుకోవాలని బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి తెలిపారు. 'నషా ముక్త్ భారత్ – వికసిత్ భారత్' (మత్తుపదార్థాల రహిత – అభివృద్ధి చెందిన భారతదేశం) అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆహూతులను అలరించాయి.

## పరిషత్ ఎన్నికలపై చంద్రబాబు, పవన్ చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేయలేకపోయిన వారికి మరో 48 గంటల సమయం కల్పించే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు ఎస్ఈసీకి సూచించింది. ఈ నేపథ్యంలో తదుపరి చర్యలు ఎలా ఉండాలనే అంశంపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలతో పాటు పరిషత్ ఎన్నికల ప్రక్రియపై ఈ పరిణామాల ప్రభావం ఎలా ఉంటుందన్న అంశంపైనా దృష్టి సారించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ఎంపిక, స్థానాల పంపకం వంటి అంశాలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో పార్టీల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరంపై చర్చించినట్లు సమాచారం. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడంపై కూడా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీఎం చంద్రబాబు నివాసానికి వెళ్లి సమావేశం కావడం రాజకీయంగా ఆసక్తి కలిగించింది. సాధారణ రీతిలో ఆయన అక్కడికి చేరుకోవడం చర్చకు దారితీసింది.

## 2028లో తెలంగాణలో కాషాయ సునామీ.. ఎంపీ అర్వింద్ ధీమా

(మొదటి పేజీ తరువాయి)

తప్పదని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభావం తగ్గిందనే ప్రచారాన్ని ఆయన ఖండిస్తూ, పార్టీ తన రాజకీయ వ్యూహాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రూపాన్ని ప్రస్తావిస్తూ అర్వింద్ విమర్శలు చేశారు. గడ్డం పెంచితే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో సూచించడంతోనే కేటీఆర్ అలా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గడ్డం పెరిగినంత మాత్రాన సీఎం పదవి రాదని వ్యాఖ్యానించారు. గతంలో కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా గడ్డం పెంచారని, దాంతో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఎదుగుదల రాలేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరస్పరం రాజకీయ ప్రయోజనాలు కాపాడుకుంటున్నాయని అర్వింద్ ఆరోపించారు. ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కుదిర్చేందుకు అంతర్గతంగా ప్రయత్నాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం, బీఆర్ఎస్ మధ్య సంబంధాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రెండు పార్టీల మధ్య అవగాహనకు ప్రధాన అడ్డంకిగా ఉన్నారని అర్వింద్ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తితో ఉందని, బీఆర్ఎస్‌తో కలిసి ఆయనను సీఎం పదవి నుంచి తొలగించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ నుంచి స్పందనను వార్తలో పేర్కొన్న వివరాలు అందుబాటులో లేవు. తెలంగాణలో బీజేపీ మౌనంగా ఉందనే అభిప్రాయం సరికాదని అర్వింద్ స్పష్టం చేశారు. పార్టీ కార్యకలాపాలు తెరవెనుక కొనసాగుతున్నాయని, రాజకీయంగా ప్రభావం చూపేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు రాష్ట్ర ప్రజలు ఓటు వేసే పరిస్థితి లేదని అర్వింద్ అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే అవసరం బీజేపీకి లేదని, ఇతర పార్టీల మద్దతు లేకుండానే అధికారాన్ని సాధిస్తామని పునరుద్ఘాటించారు. కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ సంబంధాలపై ఆయన చేసిన ఆరోపణలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.



## రైతుకు అండగా నిలవడంలో కాంగ్రెస్ వైఫల్యం

గజ్వేల్: రైతులు పంట నష్టాలతో సతమతమవుతుంటే తెలంగాణ ప్రభుత్వం అవసరమైన ఉపశమన చర్యలు చేపట్టడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. రాష్ట్రంలో కరువు ఛాయలు అలుముకున్నా పాలకులు ముందస్తు కార్యాచరణ రూపొందించలేకపోయారని ఆరోపించారు. గజ్వేల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, రైతుల నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు తలెత్తవచ్చని పది నెలల ముందుగానే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వాలను అప్రమత్తం చేశారని హరీశ్ రావు తెలిపారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆ బాధ్యతను సరిగా నిర్వర్తించలేదని విమర్శించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఉంటే రైతులకు కొంతమేర నష్టాన్ని నివారించే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో పత్తి సాగుదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో సాగు ఖర్చులు తిరిగి వచ్చే అవకాశాలు తగ్గిపోయాయని వివరించారు. పంట సాగు కోసం అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టిన రైతులు దిగుబడులు లేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో 10 నుంచి 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, వ్యవసాయ రంగంపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పంట నష్టాలతో పాటు అనేక ప్రాంతాల్లో నీటి సమస్యలు కూడా పెరుగుతున్నాయని హరీశ్ రావు చెప్పారు. కొన్ని జిల్లాల్లో ప్రజలు తాగునీటి కోసం, రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. నీటి కొరతను అధిగమించేందుకు ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని అంచనా వేసి తగిన సహాయం అందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో కరువు పరిస్థితులను గుర్తించి సంబంధిత ప్రాంతాలకు సహాయక చర్యలు చేపడుతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు.

# తెలంగాణ నీటిని కర్ణాటక అక్రమంగా తరలిస్తోంది: శ్రీనివాస్ గౌడ్

## ఆర్డీఎస్ ఆయకట్టుకు పది రోజులైనా తుంగభద్ర నీరు చేరలేదన్న శ్రీనివాస్ గౌడ్

## వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్

## రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ



తెలంగాణకు కేటాయించిన తుంగభద్ర జలాలను కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా తరలించుకుపోతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. తాగునీటి అవసరాల పేరుతో మన వాటా నీటిని కర్ణాటక మళ్లిస్తోందని, దీనిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్ర రైతుల ప్రయోజనాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. అక్టోబర్ 10 నుంచి 24 మధ్య కాలంలో సుమారు 3 టీఎంసీల నీటిని విడుదల చేయాలని తెలంగాణ నీటిపారుదల శాఖ తుంగభద్ర బోర్డును కోరినట్లు తెలిపారు. బోర్డు షెడ్యూల్ ప్రకారం నీటిని విడుదల చేసినా, పది రోజులు గడిచినా రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్) ఆయకట్టుకు నీరు చేరకపోవడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. గతంలో 1,500 క్యూసెక్కులు విడుదల చేస్తే మూడు రోజుల్లోనే ఆర్డీఎస్‌కు చేరేవని, ఇప్పుడు వారం దాటినా రాకపోవడం ఆందోళనకరమని అన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటిని కర్ణాటక తమ ఎగువ ప్రాంతాల్లోనే మళ్లిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై తుంగభద్ర బోర్డు, రాష్ట్ర నీటిపారుదల శాఖ వెంటనే విచారణ జరపాలని కోరారు. ప్రతిరోజూ విడుదలవుతున్న నీటి పరిమాణం, వినియోగం, ఆర్డీఎస్‌కు వాస్తవంగా చేరుతున్న నీటి లెక్కలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష జరిపి, కర్ణాటక ప్రభుత్వంతో చర్చించాలని శ్రీనివాస్ గౌడ్ సూచించారు. రైతులకు హామీలు ఇవ్వడమే కానీ, చేతల్లో వారి ప్రయోజనాలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు.



# హైదరాబాద్‌లో ఫార్చ్యూనర్ బీభత్సం..

- ముందున్న కారును ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు
- హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం
- అతివేగంతో వచ్చి కారును ఢీకొట్టిన ఫార్చ్యూనర్
- విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఫార్చ్యూనర్‌పైనే విరిగిపడ్డ స్తంభం

హైదరాబాద్ నగర శివారులోని పీర్జాదిగూడలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. అతివేగంతో దూసుకొచ్చిన ఓ టయోటా ఫార్చ్యూనర్ కారు, తన ముందు వెళుతున్న మరో కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముందున్న కారు బోల్తా పడగా, అదుపుతప్పిన ఫార్చ్యూనర్ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఆ ధాటికి విద్యుత్ స్తంభం విరిగి నేరుగా వాహనంపైనే పడటంతో కారు తీవ్రంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్ నంబర్ 57 సమీపంలోని ఒక పెట్రోల్ బంక్ వద్ద గురువారం ఉదయం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఫార్చ్యూనర్ కారు వెనుక నుంచి అతివేగంతో వచ్చి ఢీకొట్టడంతో, ముందున్న వాహనం అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డు డివైడర్ వైపు దూసుకెళ్లింది. అదే సమయంలో ఫార్చ్యూనర్ వాహనం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు స్తంభం విరిగి ఫార్చ్యూనర్ ముందు భాగంపై పడటంతో వాహనం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో వాహనాల్లో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# మాజీ మంత్రి హరీష్ రావుకు దసరా శుభాకాంక్షలు

## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

## మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్



**గుమ్మడిదల మున్సిపాలిటీ అక్టోబర్ 22:** దసరా పండుగను పురస్కరించుకుని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్ రావుకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. విజయదశమి పర్వదినం ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగ ప్రతి ఒక్కరికీ విజయాలను అందించాలని అన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావుతో ఆత్మీయంగా మాట్లాడి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు చక్రపాణి, కుమార్ గౌడ్, హుస్సేన్, వెంకట్ రామ్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, శేఖర్ రెడ్డి, మహేష్, ఫయాజ్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల జానపద జాతరకు కేటీఆర్‌కు ఆహ్వానం

## తెలంగాణ జానపద పరిశ్రమ ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వహణ

## రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్రను కొనియాడిన కేటీఆర్

## వేడుకల విజయవంతానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ

## పాల్గొననున్న 33 జిల్లాలకు చెందిన జానపద కళాకారులు



సిరిసిల్లలో త్వరలో నిర్వహించనున్న 'జానపద జాతర' కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ను నిర్వాహకులు ఆహ్వానించారు. తెలంగాణ జానపద పరిశ్రమ ఆధ్వర్యంలో ఈ వేడుకను సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ జానపద పరిశ్రమ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్, ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి కేటీఆర్‌ను కలుసుకొని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ కళాకారులతో ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, జానపద కళలను కాపాడటంలో కళాకారులు చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో జానపద కళాకారులు తమ పాటలు, ప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం నింపారని, మలిదశ ఉద్యమంలో వారి పాత్ర ఎంతో కీలకమని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ జానపద జాతరలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి కళాకారులు పాల్గొని తమ కళలను ప్రదర్శించనుండటం అభినందనీయమన్నారు. తెలంగాణ గొప్ప జానపద వారసత్వాన్ని చాటిచెప్పే ఈ వేడుకల విజయవంతానికి తన పూర్తి సహకారం అందిస్తానని ఆయన నిర్వాహకులకు హామీ ఇచ్చారు.

# నిజం రజాకార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల కడుపు నింపిన పోరాటయోధుడు

## పండుగ సాయన్న ముదిరాజ్ : నీలం మధు ముదిరాజ్..

## దౌల్తాబాద్ లో ఘనంగా పండుగ సాయన్న జయంతి, పాల్గొన్న నీలం..

## ఘనస్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించిన నిర్వాహకులు..





**మెదక్ జిల్లా అక్టోబర్ 22:** గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం హత్నూర్ మండలం దౌల్తాబాద్ చౌరస్తా నుండి ఎస్ ఎస్ ఆర్ గార్డెన్స్ వరకు జరిగిన ర్యాలీ లో ఆయన పాల్గొని తర్వాత అక్కడే జరిగిన పండుగ సాయన్న 174 వ జయంతి వేడుకలో పాల్గొని ప్రసంగిం చారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బీసీలలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజుల ఆరాధ్య దైవం పండుగ సాయన్న జయంతి ని అధికారికంగా ప్రకటించిన విషయాని గుర్తుచేశారు, రానున్న కాలంలో ముదిరాజులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు, పార్టీలు వేరైనా అందరూ ఐక్యం కావలసిన అవసరం ఉంది అన్నారు, అలాంటి మహావీరుడు స్ఫూర్తితో భవిష్యత్తు తరాలు పోరాటాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్, కొల్లాపూర్ శ్రీనివాస్, మహేష్, మండల సంఘం అధ్యక్షులు తలారి రాజేందర్, ఉప అధ్యక్షులు అంబటి అర్జున్, సర్పంచులు రమేష్, సుజాత సత్యం, కృష్ణ, రాజు, శ్రీనివాస్, ప్రవీణ్, గోపాల్, ఉప సర్పంచ్ ప్రసాద్, కృష్ణ, మండల్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కరే కృష్ణ,జిల్లా మాజీ ఫిషరిష్ చైర్మన్ గుణాల నర్సింలు, నాయకులు ఆంజనేయులు, పోచయ్య,మదారం రవి, యాదగిరి, సతీష్, ముదిరాజులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



# పండుగ సాయన్న ముదిరాజ్‌కు ఘన నివాళులు అర్పించిన జి.రవి ముదిరాజ్

## మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పండగ సాయి అన్నకు నివాళులర్పించిన జిల్లా కలెక్టర్

## ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు జి. రవి ముదిరాజ్



**మేడ్చల్ జిల్లా క్టోబర్ 22:** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ తొలి పోరాట యోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు జి. రవి ముదిరాజ్ మాట్లాడుతూ, పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పేదల పక్షాన నిలిచి నిరంకుశ పాలనను ఎదిరించిన పండుగ సాయన్న ప్రజా నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, వివిధ పార్టీల ముదిరాజ్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు, ముదిరాజ్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మీడియా మిత్రులకు ఘన సన్మానం

## రాజకీయాలకతీతంగా పద్మశాలీల ఐక్యతే లక్ష్యం.. రాజ్యాధికారమే ధ్యేయం



**సిరిసిల్ల, అక్టోబర్ :** సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి సమాజానికి చెందిన మీడియా మిత్రులను గురువారం పద్మశాలి సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పద్మశాలి సమాజ అభ్యున్నతి, ఐక్యత, రాజకీయ చైతన్యం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిరిసిల్లలోని పద్మశాలీలందరినీ రాజకీయాలకతీతంగా ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు, పద్మశాలి సమాజానికి రాజ్యాధికారం సాధించే దిశగా సమష్టిగా పనిచేయాలనే ఉద్దేశంతో సంఘం నాయకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కలం ద్వారా సమాజానికి సేవ.. కథనం ద్వారా ప్రజలకు దిశానిర్దేశం.. జర్నలిజం రంగంలో తమదైన ముద్ర వేస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, సమాజ గొంతుకగా నిలుస్తున్న పద్మశాలి మీడియా మిత్రులను గుర్తించి సన్మానించడం గర్వకారణమని సంఘం నాయకులు పేర్కొన్నారు. పాత్రికేయులు తమ కలం ద్వారా సమాజ అభివృద్ధికి, ప్రజల్లో చైతన్యం కల్పించడానికి చేస్తున్న కృషిని కొనియాడారు. మీడియా మిత్రుల అక్షరం సమాజానికి ఆయుధమని, వారి వృత్తి ప్రజాసేవకు ప్రతిరూపమని, వారి ఐక్యత భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, వారి సేవలను గుర్తించి గౌరవించడం సంఘం బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. పద్మశాలి సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని, యువతలో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించాలని, సమాజ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పద్మశాలీల ఐక్యతే తమ బలమని, సమాజ అభివృద్ధే అందరి లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గుంటుక పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి మాదాస్ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి జిందం రవీందర్, కోశాధికారి దాసరి వెంకటేష్, కార్యవర్గ సభ్యులు గాజుల సదానందం, కుందేన సాయి శరత్, తాటిపాముల సత్యనారాయణ, దూడం సురేష్, మహేశుని అనిల్, గజ్జెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

## విజయవాడలో దారుణం: వాటర్ బాటిల్ దొంగిలించాడని కొట్టి చంపారు!

- విజయవాడలో తెలంగాణకు చెందిన వ్యక్తి దారుణ హత్య
- రూ. 20 వాటర్ బాటిల్ దొంగిలించాడన్న అనుమానంతో దాడి
- విద్యుత్ స్తంభానికి కట్టేసి కర్రలతో కొట్టిన నలుగురు దుండగులు
- దాదాపు రెండు గంటల పాటు కొనసాగిన కిరాతక దాడి
- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

విజయవాడ నగరంలో అత్యంత అమానవీయ ఘటన చోటుచేసుకుంది. కేవలం రూ. 20 విలువైన వాటర్ బాటిల్ దొంగిలించాడన్న నెపంతో తెలంగాణకు చెందిన ఒక వ్యక్తిని నలుగురు వ్యక్తులు అత్యంత కిరాతకంగా కొట్టి హతమార్చారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్టోబర్ 18న రాత్రి జరిగిన ఈ దారుణ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, మృతుడిని తెలంగాణలోని నల్గొండ జిల్లాకు చెందిన సాయికుమార్ (33)గా గుర్తించారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. యాదాద్రి - భువనగిరి జిల్లాలోని ఒక ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో గత ఆరు నెలలుగా పనిచేస్తున్న సాయికుమార్, పని నిమిత్తం విశాఖపట్నం వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అక్టోబర్ 18న తాను విజయవాడలో ఉన్నట్లు భార్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అదే రోజు రాత్రి పటమట డొంక రోడ్డులోని ఒక పాన్ షాపు వద్ద సాయికుమార్ వాటర్ బాటిల్ దొంగిలించేందుకు ప్రయత్నించాడు. దీనిని గమనించిన ఓ పాల వ్యాన్ డ్రైవర్, పాన్ షాపులో పనిచేసే రవిశంకర్‌ను అప్రమత్తం చేశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన రవిశంకర్, సాయికుమార్‌ను బయటకు లాగి విచక్షణారహితంగా దాడి చేయడం ప్రారంభించాడు. సమీపంలోని మద్యం దుకాణంలో పనిచేసే అయ్యప్ప కూడా ఇందుకు తోడయ్యాడు. వీరిద్దరూ కలిసి సాయికుమార్ చేతులను వెనక్కి విరిచి కట్టేసి, సమీపంలోని విద్యుత్ స్తంభానికి కట్టేసి కర్రలతో దాడి చేశారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ దాడిలో అనంతరం పోతన్‌శెట్టి నవీన్, సాయి ప్రణీత్ అనే మరో ఇద్దరు వ్యక్తులు కూడా పాలుపంచుకున్నారు. సాయికుమార్ ప్రాణాల కోసం వేడుకున్నప్పటికీ నిందితులు ఏమాత్రం కనికరించలేదు. తీవ్ర గాయాలతో సాయికుమార్ స్పృహతప్పి పడిపోవడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పటమట పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పవన్ కిషోర్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో లభించిన సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దాడికి పాల్పడిన నలుగురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 103(1) కింద హత్య కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఫిబ్రవరి 24 నుంచి ఏపీలో ఇంటర్ పరీక్షలు.. షెడ్యూల్ విడుదల

ఆంధ్రప్రదేశ్‌లో 2027 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు ప్రకటించింది. థియరీ పరీక్షలు 2027 ఫిబ్రవరి 24 నుంచి మార్చి 16 వరకు జరగనున్నాయి. వివరాల్లోకి వెళితే, ఇంటర్ ఫస్టియర్ (జూనియర్ ఇంటర్) పరీక్షలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి జరగనుండగా, సెకండియర్ (సీనియర్ ఇంటర్) పరీక్షలు మరుసటి రోజు, అనగా ఫిబ్రవరి 25న మొదలవుతాయి. ప్రతీరోజూ ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. థియరీ పరీక్షలకు ముందే ప్రాక్టికల్స్ పూర్తి కానున్నాయి. జనరల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుపుతారు. ఇక ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ పరీక్షలను ఆదివారాలతో సహా ప్రతీరోజూ రెండు సెషన్లలో (ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు) నిర్వహిస్తామని బోర్డు స్పష్టం చేసింది. అయితే, ప్రస్తుతం విడుదల చేసిన ఈ షెడ్యూల్ తాత్కాలికమైనదని (ప్రొవిజనల్) అధికారులు తెలిపారు. ప్రభుత్వ సెలవులు, పండుగల తేదీలను పరిగణనలోకి తీసుకుని తుది షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసే అవకాశం ఉందని వారు సూచించారు. విద్యార్థులు ఈ తాత్కాలిక షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

## పవన్ రాజీనామా అంటూ ఫేక్ న్యూస్: సైబర్ చర్యల హెచ్చరికతో క్షమాపణ చెప్పిన వాట్సాప్ గ్రూప్ అడ్మిన్

- పవన్ కల్యాణ్ రాజీనామా అంటూ వాట్సాప్‌లో తప్పుడు ప్రచారం
- చర్యల భయంతో బహిరంగ క్షమాపణ చెప్పిన వాట్సాప్ గ్రూప్ అడ్మిన్
- సోషల్ మీడియాలో చూసి, నిర్ధారించుకోకుండా షేర్ చేశానని వెల్లడి



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన పదవికి రాజీనామా చేస్తున్నారంటూ వాట్సాప్‌లో తప్పుడు సమాచారాన్ని సర్క్యులేట్ చేసిన ఓ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ క్షమాపణలు చెప్పారు. ఈ ఫేక్ న్యూస్‌ను తీవ్రంగా పరిగణించిన ఉప ముఖ్యమంత్రి కార్యాలయం సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించడంతో, సదరు అడ్మిన్ వెనక్కి తగ్గారు. సోషల్ మీడియాలో వచ్చిన ఒక పోస్ట్ చూసి, నిజానిజాలు నిర్ధారించుకోకుండా "పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా" అని గ్రూప్‌లో షేర్ చేసినట్లు అడ్మిన్ తన వివరణలో తెలిపారు. ఇది ఎలాంటి దురుద్దేశంతో జరగలేదని, పొరపాటున జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పవన్ కల్యాణ్‌కు, జనసేన నాయకులకు, కార్యకర్తలకు, గ్రూప్ సభ్యులకు మనస్ఫూర్తిగా క్షమాపణ చెబుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పూర్తి వివరాలు తెలుసుకున్నాకే పోస్టులు షేర్ చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు, పవన్ రాజీనామా చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై డిప్యూటీ సీఎం కార్యాలయం తీవ్రంగా స్పందించింది. "డిప్యూటీ సీఎంఓ, ఆంధ్రప్రదేశ్" పేరుతో నడుస్తున్న ఫేక్ వాట్సాప్ ఛానెల్‌పై, ఇతర తప్పుడు ప్రచారాలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ కార్యాలయం పేరును దుర్వినియోగం చేస్తూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ అధికారిక హెచ్చరికల నేపథ్యంలోనే వాట్సాప్ అడ్మిన్ క్షమాపణ చెప్పినట్లు స్పష్టమవుతోంది.

## ఆర్గనైజ్డ్ క్రైమ్‌తో ఎన్నికలు ఆపేందుకు జగన్ అండ్ కో కుట్ర: టీడీపీ నేత వర్మ

- ఎన్నికలు ఆపడమే లక్ష్యంగా వైసీపీ హింసకు పాల్పడుతోందన్న వర్మ
- ఓటర్ల జాబితా సవరణతో దొంగ ఓట్లు బయటపడతాయని భయపడుతున్నారని విమర్శలు
- రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోనే హింస వెనుక కుట్ర అని ఆరోపణ
- హింసాత్మక ఘటనలపై ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతోనే జగన్ గుండెల్లో వణుకు మొదలైందని, ప్రజల తిరుగుబాటును చూసి ఓటమి భయంతో ఎన్నికలను ఏదో ఒక రకంగా ఆపేందుకు 'గొడ్డలి పార్టీ' కుట్రలు పన్నుతోందని టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆర్గనైజ్డ్ క్రైమ్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే జగన్ అండ్ కో నైజమని ఆయన మండిపడ్డారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అడ్డుకోవడానికి వైసీపీ ముఠా విశ్వప్రయత్నాలు చేస్తోందని వర్మ ఆరోపించారు. దీని వెనుక ఉన్న కారణం స్పష్టమని, బూత్‌ల స్థాయిలో గతంలో చేసిన ట్యాంపరింగ్ బండారం బయటపడుతుందని, చనిపోయిన వారి పేర్లతో దొంగ ఓట్లు వేయించుకోవడం, రిగ్గింగ్ చేయడం ఇకపై సాధ్యం కాదనే భయంతోనే జగన్ రెడ్డి ఓటర్ల జాబితా ప్రక్షాళనను చూసి గిలగిలా కొట్టుకుంటున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాలు స్వయం సమృద్ధి సాధించకుండా, స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా, పంచాయతీలకు నిధులు రాకుండా అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు కోర్టుల్లో ఏకంగా 59 కేసులు వేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలను అణచివేయడమే వైకాపా నైజమని, బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారని ఆరోపించారు. చంద్రబాబు మాత్రం బీసీల పక్షపాతిగా నిలిచి, స్థానిక సంస్థల్లో 34 శాతానికి పైగా స్థానాలు కేటాయించి వారిని రాజకీయంగా ప్రోత్సహించారని తెలిపారు. వైసీపీపై ప్రజల్లో విశ్వాసం పూర్తిగా అడుగంటిందని, దీంతో ఉనికి కోల్పోతామనే భయంతో దాడులకు దిగుతూ వార్తల్లో నిలిచేందుకు తాపత్రయపడుతున్నారని వర్మ అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ హింస చెలరేగినా అది పక్కా ప్లాన్ ప్రకారం ఎన్నికలు ఆపేందుకు వైసీపీ పన్నుతున్న వ్యూహంలో భాగమేనని ప్రజలు గ్రహించాలన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కేవలం రాయలసీమలోని 15 సమస్యాత్మక ప్రాంతాలు, ప్రకాశం, పల్నాడు ప్రాంతాల్లోనే హింసాత్మక ఘటనలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. ఒకవైపు ఆ పార్టీ నేత కోన రఘుపతి ఎన్నికల సంఘం ఏర్పాట్లను ప్రశంసిస్తుంటే, మరోవైపు జగన్ అనుచరులు ఎన్నికల వ్యవస్థపై విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ చేసిన దుర్మార్గాలను ఎవరూ మరిచిపోలేదని, టీడీపీ అభ్యర్థులను భయపెట్టి వెయ్యికి పైగా నామినేషన్లను బలవంతంగా ఉపసంహరింపజేశారని వర్మ ఆరోపించారు. పుంగనూరు, తంబళ్లపల్లె, చంద్రగిరి, పులివెందుల, మాచర్ల వంటి మున్సిపాలిటీల్లో ప్రత్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేసి బలవంతపు ఏకగ్రీవాలు చేసుకున్నారని, పిఠాపురంలో నడిరోడ్డుపై బ్యాలెట్ బాక్సులను ఎత్తుకెళ్లి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ముగ్గురికి మాత్రమే అనుమతి ఉంటే, ఏకంగా 500 మంది గూండాలను వెంటేసుకుని వచ్చి ప్రజలపై, పోలీసులపై దాడులు చేశారని మండిపడ్డారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి సోదరుడు స్వయంగా గూండాయిజం చేయడం, విధుల్లో ఉన్న పోలీసులపై మాజీ మంత్రి రోజా దురుసుగా ప్రవర్తించడం వారి ఫ్యాక్షన్ బుద్ధికి నిదర్శనమన్నారు. ఇలాంటి గూండా సంస్కృతిని ప్రజలు సహించబోరని, జగన్ రెడ్డి కుట్రలను తిప్పికొడతారని స్పష్టం చేశారు. అశాంతిని సృష్టించే వైసీపీ మూకలపై ఎన్నికల సంఘం, పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్యం గెలవడం ఖాయమని వర్మ ధీమా వ్యక్తం చేశారు.

## తంబళ్లపల్లెలో జనసేన కార్యాలయంపై వైసీపీ దాడి అత్యంత హేయం

- అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో జనసేన కార్యాలయంపై దాడి
- స్థానిక ఎన్నికల నామినేషన్ల వేళ వైసీపీ గూండాల పనేనని ఆరోపణ
- గెలవలేమనే వైసీపీ హింసకు పాల్పడుతోందన్న నాదెండ్ల మనోహర్
- దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్



అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో జనసేన పార్టీ కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ఈ దాడి జరగడం అత్యంత హేయమైన చర్య అని ఆయన అభివర్ణించారు. ఓటమి భయంతోనే వైసీపీ హింసకు పాల్పడుతోందని, రాష్ట్రంలో అశాంతి సృష్టించాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. తంబళ్లపల్లెలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లు దాఖలు చేయడానికి వెళుతున్న జనసేన నాయకులు, కార్యకర్తలను వైసీపీ శ్రేణులు కవ్వించి దాడులకు తెగబడ్డాయని నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని జనసేన కార్యాలయాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, కొన్ని వాహనాలను కూడా నాశనం చేశారని, అడ్డు వచ్చిన వారిపై మారణాయుధాలతో దాడి చేశారని ఆయన ఆరోపించారు. "రాష్ట్రంలో అలజడులు, గొడవలు సృష్టించి స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయాలనే దురుద్దేశంతోనే వైసీపీ ఈ దుశ్చర్యలకు పాల్పడుతోంది. ఎన్నికల్లో గెలవలేమని స్పష్టంగా అర్థం కావడంతోనే హింస మార్గాన్ని ఎంచుకుంది" అని మనోహర్ విమర్శించారు. జనసేన ఇలాంటి గూండా చర్యలను చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తీవ్రంగా పరిగణించి, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాదెండ్ల మనోహర్ డిమాండ్ చేశారు. పోలీసు యంత్రాంగం కూడా వెంటనే స్పందించి దాడికి పాల్పడిన వారిని, వారి వెనుక ఉన్న సూత్రధారులను అరెస్టు చేయాలని కోరారు. ప్రజాస్వామ్యవాదులందరూ వైసీపీ చేస్తున్న ఈ అరాచక చర్యలను ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.

## చంద్రబాబు రాజ్యాంగ వ్యవస్థలను అడ్డుకుంటున్నారు: ధర్మాన

- స్థానిక ఎన్నికల వివాదంపై సుప్రీంకోర్టు జోక్యం
- రాష్ట్రంలో 100 స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను నిలిపివేసిన ఎస్ఈసీ
- సుప్రీం ఆదేశాలను స్వాగతించిన వైసీపీ నేత ధర్మాన



ఆంధ్రప్రదేశ్‌లో 100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నిలిపివేసింది. సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను వైసీపీ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్వాగతించారు. శ్రీకాకుళంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ రాజ్యాంగ వ్యవస్థలను స్వతంత్రంగా, సక్రమంగా పనిచేయకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో రాజ్యాంగ విరుద్ధమైన విధానాలు కొనసాగుతున్నాయనడానికి సుప్రీంకోర్టు ఆదేశాలే నిదర్శనమన్నారు. ఆయన పాలనలో పోలీస్ వ్యవస్థ, ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేయలేకపోతున్నాయని ఆరోపించారు.

## వైసీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

టీడీపీకి శ్రీకాకుళం జిల్లాలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వైసీపీలో చేరారు. గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత జగన్ ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. లక్ష్మీదేవితో పాటు ఆమె అనుచరులు కూడా పెద్ద సంఖ్యలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా తమ కుటుంబం టీడీపీకి సేవలందించిందని, కానీ చివరకు తీవ్ర అవమానాలే ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసినా అన్నీ కోల్పోయామని వాపోయారు. తన భర్త, దివంగత నేత, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ పార్టీలో అవమానాలు ఎదుర్కొన్నారంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తన భర్త అనారోగ్యంతో ఉన్నప్పుడు కనీసం పరామర్శించేందుకు కూడా టీడీపీ అధినేత రాలేదని ఆమె విమర్శించారు. తన భర్త విగ్రహాన్ని శ్రీకాకుళంలో ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తే, స్థానిక టీడీపీ నేతలు అడ్డుకున్నారని, విగ్రహం కోసం నిర్మించిన దిమ్మెలను కూడా ధ్వంసం చేశారని గుండ లక్ష్మీదేవి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని, అందుకే ఎంతో బాధతో పార్టీని వీడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో టికెట్ నిరాకరించినా పార్టీలోనే కొనసాగామని, అయినా తమను దూరం పెట్టారని అన్నారు. ఇటీవల శ్రీకాకుళం మేయర్ పదవిని ఆమె ఆశించగా, పొత్తులో భాగంగా ఆ పదవిని జనసేనకు కేటాయించడంతో పరిణామాలు వేగంగా మారాయి. ఈ నేపథ్యంలోనే మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఇతర వైసీపీ నేతలు ఆమెను పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. కూటమి పాలనలో ప్రజలు కష్టాలు పడుతున్నారని, వారికి మంచి చేయాలనే లక్ష్యంతోనే వైసీపీలో చేరానని లక్ష్మీదేవి తెలిపారు.

## ఏపీలో పరిషత్ నామినేషన్ల వేళ రణరంగం..

- పలుచోట్ల ఘర్షణలు, గాల్లోకి కాల్పులు
- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్లు
- కడప జిల్లా నందలూరులో టీడీపీ వర్గాల మధ్య రాళ్లదాడి, గాల్లోకి కాల్పులు
- కనిగిరి, యర్రగొండపాలెంలో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ
- శాంతిభద్రతల దృష్ట్యా కడపలో పలువురు వైసీపీ నేతల అరెస్ట్
- ఘర్షణల్లో వాహనాలకు నిప్పు, పలుచోట్ల పోలీసుల లాఠీఛార్జ్

రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ హింసాత్మకంగా మారింది. గురువారం పలు జిల్లాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఘర్షణలు చోటుచేసుకోగా, మరికొన్ని చోట్ల అంతర్గత వర్గపోరు భగ్గుమంది. రాళ్ల దాడులు, వాహనాలకు నిప్పు పెట్టడం, గాల్లోకి కాల్పులు జరపడంతో పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే, కడప జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని నందలూరులో పరిస్థితి అదుపుతప్పింది. టీడీపీలోని రెండు వర్గాలు తమ అభ్యర్థులే నామినేషన్ వేయాలని పట్టుబట్టడంతో వివాదం చెలరేగింది. టీడీపీ అధికార ప్రతినిధి బాలసుబ్రమణ్యం, మరో నేత విజయసాగర్ వర్గీయుల మధ్య మొదలైన వాగ్వాదం తీవ్ర ఘర్షణకు, రాళ్ల దాడికి దారితీసింది. ఈ ఘటనలో ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆగ్రహంతో ఓ కారుకు నిప్పు పెట్టారు. ఈ క్రమంలో బాలసుబ్రమణ్యం గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరపడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. మరోవైపు, మార్కాపురం జిల్లా కనిగిరిలో నామినేషన్ల కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరినే అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేయడంతో వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిపై దాడికి యత్నించడంతో అక్కడ టెన్షన్ వాతావరణం ఏర్పడింది. యర్రగొండపాలెంలోనూ టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తోపులాట జరగగా, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఇక కడప జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వైసీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ మంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి సహా పలువురు ముఖ్య నేతలను అరెస్ట్ చేసి అట్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ కూడా ఉద్రిక్తత నెలకొంది.



# అబ్బాయిల్ని పెంచడం ఎలా?




అమ్మాయిల్ని మాత్రమే కాదు, అబ్బాయిల్ని కూడా ఆత్మ విశ్వాసంతో, స్వేచ్ఛగా పెంచడం సవాలుతో కూడిన వ్యవహారమే అంటారు ప్రముఖ నటి నందితా దాస్. పుట్టినప్పటి నుంచి ఎనిమిదేండ్లు వచ్చే వరకు తన కొడుకుతో అనుభవాలను క్రోడీకరిస్తూ 'రైజింగ్ స్టార్స్' అనే పుస్తకంలో ఓ వ్యాసం రాశారు నందిత. ఇందులో బాలీవుడ్ అమ్మలు పిల్లల్ని పెంచడంలో ఉన్న సవాళ్లను చర్చించారు. "దురదృష్టవశాత్తూ మన సామాజిక నిర్మాణమే లైంగిక వివక్షను ప్రోత్సహించేలా ఉంది. బొమ్మల దుకాణాల్లోకి వెళ్తే పాపలకు, బాబులకు వేర్వేరు సెక్షన్లు ఉంటాయి. ఏ కారణంతో అయినా అబ్బాయి ఏడిస్తే.. 'అమ్మాయిలా ఏంటా కన్నీళ్లు?' అని తిట్టేస్తారు. అమ్మాయి కాస్త నిర్లక్ష్యంగా కనిపిస్తే.. 'మగరాయుడిలా ఉండొద్దు' అని తలంటుతారు. దీనికి పరిష్కారంగా.. పిల్లలకు జెండర్ సెన్సిటివిటీని పరిచయం చేయాలి. అబ్బాయిలతోనూ ఇంటి పని చేయించాలి. దీనివల్ల అమ్మాయిల్ని గౌరవించడం అలవాటు అవుతుంది. పెద్దయ్యాక పనిలో జీవితభాగస్వామికి సాయపడతారు. అనుబంధాలు బలపడతాయి. సరైన మార్గదర్శకత్వం ఉంటేనే పిల్లల్లో సమతూకం ఏర్పడుతుంది. పిల్లలకు పర్యవేక్షణతో కూడిన స్వేచ్ఛ ఇవ్వడమే మేలు" అంటారు నందిత తన వ్యాసంలో.

# 'కరకరలాడే బిస్కెట్లు' ఇక మీ సొంతం!



'మనం తినేవాటిలో అనేక పదార్థాలుంటాయి. అందులో మెత్తవైనా ఉండొచ్చు, గట్టివిగానూ ఉండొచ్చు. అయితే అప్పడాలు, బిస్కెట్లలో చాలామటుకు కరకరలాడే వాటినే ఇష్టపడుతుంటాం. బిస్కెట్లను తీసుకున్నట్లయితే వీటిలో కూడా చాలా రకాలుంటాయి. మనకు ఇష్టమైనటువంటి కొన్ని రకాల బిస్కెట్లలో ఈ కరకరలాడే బిస్కెట్లు తోడైతే ఆ రుచి, అనుభూతియే వేరు. మరెందుకు ఆలస్యం వాటిని గురించి ఇప్పుడు తెలుసుకుందాం!'

## కరకరలాడాలంటే..

బిస్కెట్లు మెత్తగా అవ్వకుండా కరకరలాడాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోండి! ప్లాస్టిక్, అల్యుమినియం డబ్బాలు, గాజు పాత్రల్లో బిస్కెట్లు, కుకీలను నిల్వచేయాలి. గాలి చొరబడకుండా పెడితే ఎక్కువరోజులపాటు క్రిస్పీగా ఉంటాయి. డబ్బాల్లో నిల్వచేసేటప్పుడు అడుగు భాగంలో రెండుమూడు వరుసల్లో టిష్యుపేపర్లు వేసి తరువాత బిస్కెట్లు పెట్టాలి. బిస్కెట్లపైన మరో రెండు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి పైన బిస్కెట్లు పెట్టాలి. ఇలా నిండుగా పెట్టి గాలిచొరబడకుండా మూత పెట్టాలి. జిప్‌లాక్ పౌచ్‌లలో నిల్వచేస్తే కూడా కుకీలు తాజాగా ఉంటాయి. గాలి చొరబడని డబ్బాలు, జిప్‌లాక్ పౌచ్‌లను రిఫ్రిజిరేటర్‌లో పెడితే మరిన్ని రోజులు బిస్కెట్లు తాజాగా ఉంటాయి. అనుకో కుండా సరిగా నిల్వచేయనప్పుడు మెత్తబడిన కుకీలను అవెన్ లేదా ఎయిర్‌ఫ్రైయర్‌లో ఉంచి వేడిచేస్తే మళ్లీ క్రిస్పీగా మారతాయి, వీటిని కూడా నిల్వచేసుకోవచ్చు.



# టమాటాలు ఫ్రిజ్‌లో పెడుతున్నారా?

సాధారణంగా టమాటాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండవు. ఫ్రిజ్‌లో పెడితే కనీసం ఓ వారం అయినా వాడుకోవచ్చు. అందులో అయితే కనీసం నాలుగురోజుల వరకు పాడవ్వకుండా కాపాడుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే ఇలా ఫ్రిజ్‌లో పెట్టడం అస్సలు మంచిది కాదంటున్నారు శాస్త్రవేత్తలు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫ్రిజ్‌లో పెట్టొదని హెచ్చరిస్తున్నారు కూడా. ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఏం జరుగుతుందో దాని వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయో సవివరంగా వెల్లడించారు.

**ఎందుకు పెట్టకూడదంటే..**

ఫ్రిజ్‌లో పెడితే టమాటాలు ముందుగా వాటికుండే సహజసిద్ధమైన రుచిని కోల్పోతాయని చెబుతున్నారు పరిశోధకులు. 39 డిగ్రీల చల్లటి ఉష్టోగ్రతలో ఉన్న టమాటాల్లో వాటికి సహజంగా ఉండే వాసన ఎలా కోల్పోతుంది పరిశోధనలో వెల్లడైంది. ఒకటి రెండు రోజులు ఫ్రిజ్‌లో ఉంటే పర్లేదు గానీ చాలా రోజులు ఫ్రిజ్‌లో ఉంటే మాత్రం టమాటకు ఉన్న సహజ లక్షణం కోల్పోతుందని చెప్పారు. అలాగే దాని డీఎన్ఏ మిథైల్ సంశ్లేషణలో మార్పులు వస్తాయని అన్నారు. మిథైలేషన్ అనేది మిథైల్ సమూహంగా పిలిచే అణువుల సమూహం. జీవి డీఎన్ఏకి అనుగుణంగా పనితీరును మార్చే ప్రక్రియ ఇది కీలకం. జన్యు వ్యక్తీకరణను నియంత్రించడంలో మిథైలేషన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది సక్రమంగా లేకపోతే అసాధారణ వ్యాధుల వచ్చేందుకు దారితీస్తుంది. ఎప్పుడైతే సుదీర్ఘకాలం రిఫ్రిజిరేటర్‌లో టమోటాలు ఉంచుతామో వాటి లోపల ఉన్న జెల్లీ



విరిగిపోతుంది. దీని కారణంగా ఇది మృదువుగా మారుతుంది. ఒకరకంగా చెప్పాలంటే లోపలంతా జ్యూసీగా అయిపోతుంది. దీన్ని ఆహారంగా తీసుకోవడం అంత మంచిది కాదు. టమాటాలు పండినప్పుడు ఇథిలిన్‌ను విడుదల చేస్తాయి. ఐతే ఫ్రిజ్‌లోని చల్లదనం కారణంగా టమాటాల్లో ఇథిలిన్ ఉత్పత్తిని నిలిచిపోతుంది.. దీంతో టమాటాలు రుచిని కోల్పోయి పుల్లగా మారిపోతాయి. అందువల్ల వాటిని ఎల్లప్పుడూ గది ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేయడమే మంచిది. టమాటాలు పండినప్పుడు ఇథిలిన్‌ను విడుదల చేస్తాయి. ఐతే రిఫ్రిజిరేటర్‌లోని చల్లదనం ఈ ఇథిలీన్ ఉత్పత్తిని నిలిపేస్తుంది. ఇది టమోటాలు రుచిని కోల్పోవడానికి లేదా పుల్లగా మారడానికి కారణమవుతుంది. కాబట్టి టమోటాలు ఎల్లప్పుడూ గది ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేయడమే మంచిదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సుదీర్ఘకాలం ఫ్రిజ్‌లో ఉన్న టమాటాలు విషంతో సమానమని వాడకపోవడమే మంచిదని చెబుతున్నారు. కాగా, తాము ప్రస్తుతం చల్లదనంలో కూడా టమాటాలు రుచిని కోలపోకుండా ఉండేలా పలు పరిశోధనలు చేస్తున్నట్లు వెల్లడించారు శాస్త్రవేత్తలు.

# కడిగిపారేద్దాం!



కూరగాయలు, పండ్లకు అంటిన పురుగు మందులను వదిలించేందుకు రకరకాల యంత్రాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. నిజానికి, నీటితోనే 90 శాతం శుభ్రత సాధ్యం.

కూరగాయలకు అంటిన రసాయనాలను శుభ్రం చేయడానికి ఓ చిట్కా ఉంది. ఒక గిన్నె నీటిలో నిమ్మరసం, సోడా, ఆపిల్ సిడార్ వెనెగర్ కలపాలి. ఆ ద్రవాన్ని కూరల మీద చల్లి ఐదారు నిమిషాల తర్వాత నీటితో కడిగేస్తే చాలా ప్రయోజనం ఉంటుంది. కూరగాయల పైన తొక్క తీసేయాలి అనుకున్నప్పుడు వాటిని కడగాల్సిన పన్లేదు అని చాలామంది అభిప్రాయం. తొక్క తీసేటప్పుడు వాటికి ఉన్న సూక్ష్మక్రిములు కూరగాయల మీద పరుచుకునే ప్రమాదం ఉంది. కాబట్టి తొక్క తీసేముందు కూడా కడగాల్సిందే. ఇంట్లో పెంచుకున్న, ఆర్గానిక్ పద్ధతిలో పండించిన కూరగాయలపై పురుగుమందులు లేకపోవచ్చు. కానీ బ్యాక్టీరియా తిష్ఠవేసే ప్రమాదం లేకపోలేదు. వాటినీ శుభ్రం చేయాల్సిందే. చాలామంది కూరగాయల్ని ఇంటికి తెచ్చుకున్న వెంటనే శుభ్రం చేసి సంతృప్తి పడిపోతారు. కానీ వాడేలోపు%ా% వాటి మీద బ్యాక్టీరియా చేరే అవకాశం ఉంది. కాబట్టి ప్రతీ కూరగాయనూ వాడేముందు మళ్లీ కడగాలి. కూరగాయలో కొంతభాగం పాడైతే%ా% అంతవరకూ తుంచేసి వండుకోవడం మనకు అలవాటు. ఇదేమంత మంచి పద్ధతి కాదు. అలాంటివాటిని పారేయడమే మేలు. చాలామందికి పచ్చికూరగాయలు తినడం అలవాటు. శుభ్రంగా కడిగిన తర్వాత కూడా మిగిలిపోయే బ్యాక్టీరియాతో అసలుకే మోసం రావచ్చు. కాబట్టి డైటీషియన్‌ను సంప్రదించి ఏ పచ్చి కూరగాయల్ని ఎలా తినాలో తెలుసుకోవాలి. వాటినే ఆరగించాలి. నిజానికి కొన్నిటిని పచ్చిగా తినడం ఆరోగ్యకరం కాదని కూడా చెబుతారు.

# ఏటి మహిళ.. టేలర్ స్విఫ్ట్



టైమ్ మ్యాగజైన్ ముఖచిత్రంగా కనిపించడమే ఓ జీవితకాల విజయం, అతిగొప్ప అనుభవం. అదనంగా 'ఈ ఏటి మేటి వ్యక్తి'గా గుర్తిస్తే.. చెప్పేదేముంది? ఆ అరుదైన ఖ్యాతిని దక్కించుకున్నారు ప్రముఖ పాప్ గాయని టేలర్ స్విఫ్ట్. తన పన్నెండో ఏట అనుకోకుండా సంగీత ప్రపంచంలో అడుగుపెట్టిన టేలర్%ా% ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. ఆమె గాత్రానికి లోకమంతా దాసోహమంది. అందుకు తాజా సాక్ష్యం.. టేలర్ ఈ ఏడాది మొదలుపెట్టిన 'ఎరాస్ టూర్'. ఈ యాత్రలో అడ్వాన్స్ టికెట్లే 100 మిలియన్ డాలర్లను సంపాదించి పెట్టాయి. టేలర్‌ను 'పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా గుర్తిస్తూ రాసిన వ్యాసంలో టైమ్ పత్రిక 'తన చరిత్రను తానే లిఖించుకున్న అరుదైన వ్యక్తి టేలర్' అని కీర్తించింది. 'ఎరాస్ టూర్' సాధారణ కచేరీ కాదు. కొన్ని గంటల పాటు ప్రేక్షకులకు ఏకబిగిన ఆటపాటలను, వినోదాన్ని అందిస్తుంది. ఈ తరహా ప్రదర్శనను 'కాన్సర్ట్ ఫిల్మ్' అంటారు.

# మనం పౌరులమన్న దానికి గుర్తింపు ఏదీ ?




**ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్‌పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది..? దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు? రాజ్యాంగం ఏం చెబుతోంది? పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది? ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు వంటి సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి.**

విదేశీ వ్యవహారాల శాఖ ఏం చెప్పింది..మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్‌పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ కూడా కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది కేంద్రమే తేల్చాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ కేవలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒకే తరహా యూనివర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒకే ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారంగానే వస్తుంది. చాలామంది పాతతరం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు. వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందుకే ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందుకే రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం కూడా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు కేవలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగానే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు

జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి. ఇక రెండో మార్గం వారసత్వం. విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశంలో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భారత్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సమికి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్‌పోర్టు ఇవ్వకూడదనే నియమం కూడా ఏమీ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు కూడా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికారాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లుగా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పొరపాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్‌పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. దీంతో ఇప్పుడు పౌరసత్వ కార్డులు తీసుకోవాల్సిన అవసరం కూడ ఆ రావచ్చు. దీనికి కూడా కేంద్రం కసరత్తు చేస్తుందా అన్నది చూడాలి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.

# కాలం మీద కాదు కావచ్చు... కానీ విజయం మీదే!

**తోటలో ఒక అందమైన మొక్కను నాటినప్పుడు, ప్రకృతిలోని ప్రతి ప్రాణీ ఒకే క్షణంలో స్పందించదు. రంగురంగుల పూల ప్రపంచంలో ప్రతి మొక్కా ఒకే సమయంలో మురిపెంగా పూవులు పూయదు. కొన్ని మొక్కలు నాటిన వారం రోజుల్లోనే చిరునవ్వులతో మొగ్గ తొడుగుతాయి, మరికొన్ని నెలల తరబడి కేవలం పచ్చని ఆకులు మాత్రమే వేస్తూ కాలపరీక్షకు నిలుస్తాయి. కానీ, తీరా ఒకరోజు అవి నిశ్శబ్దంగా పూచినప్పుడు, ఆ అద్భుతమైన పరిమళం ముందుగా పూసిన పువ్వుల సువాసన కంటే ఏమాత్రం తక్కువ ఉండదు. నిజానికి, ఆ సుగంధం గుండెలను తాకుతుంది.**



మన నిత్య మనిషి జీవితం కూడా సరిగ్గా ఇలాంటి ఒక అద్భుతమైన కాన్వాస్ లాంటిదే. కొందరు చాలా చిన్న వయసులోనే విజయ తీరాలను తాకి మురిసిపోతే, మరికొందరు జీవితంలో ఎన్నో ఆటంకాలను దాటుకుంటూ చాలా ఆలస్యంగా తమ కలల లక్ష్యాన్ని చేరుకుంటారు. అయితే, ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమిటంటే, ఆలస్యం అయిందనే ఒకే ఒక్క కారణంతో వారు సాధించిన ఆ అద్భుత విజయం విలువ ఏమాత్రం తగ్గిపోదు. నిజానికి, కాలంతో పోరాడి ఆలస్యంగా వికసించిన పువ్వు తన పరిమళాన్ని సమాజంలో మరింత గాఢంగా, సుదీర్ఘంగా వెదజల్లుతుంది.

నేటి ఆధునిక, పరుగుల సమాజంలో ప్రతి చిన్న విషయానికీ ఒక కఠినమైన వయోపరిమితిని సృష్టించడం ఒక అలవాటుగా మారిపోయింది. ఇరవై ఏళ్లకే చేతిలో మంచి ఉద్యోగం ఉండాలి, ఇరవై ఐదేళ్లకే వైభవంగా వివాహం జరిగిపోవాలి, ముప్పై ఏళ్ల వయసు వచ్చేసరికి సొంత ఇల్లు, లగ్జరీ కారు ఉండాలనే ఒక అనధికారిక, అదృశ్య కాలపట్టికను నేటి కార్పొరేట్ సమాజం మన మెదళ్లపై బలవంతంగా రుద్దుతోంది. ఈ కృత్రిమ కాలపట్టికను అందుకోలేక, ఆ పరుగులో కాస్త వెనుకబడినప్పుడు, చాలామంది యువతీ యువకులు మానసికంగా కుంగిపోతూ, తమను తాము పూర్తి విఫలులుగా భావించుకుంటున్నారు. సోషల్ మీడియాలో స్నేహితుల విజయాల పోస్టులు చూస్తూ, వారు ముందుకు దూసుకుపోతుంటే, తాము మాత్రమే ఒకేచోట వెనుకబడిపోయామనే నిరాశాజనక భావన మనసును తీవ్రంగా గాయపరుస్తుంది. కానీ, ఇక్కడే మనం ఒక పరమ సత్యాన్ని పూర్తిగా మరచిపోతాం జీవితం అనేది ఎవరితోనో పోటీపడే ఒక పరుగు పందెం కాదు, అది మనతో మనం సాగించే ఒక నిరంతర ప్రయాణం. ప్రతి ప్రయాణానికీ దాని స్వంత వేగం, దాని స్వంత ప్రత్యేకమైన మార్గం ఖచ్చితంగా ఉంటాయి.మనం ఒకసారి ప్రపంచ చరిత్రను ఆసక్తిగా వెనక్కి తిరిగి చూస్తే, ఆలస్యంగా అద్భుత విజయాలు సాధించి ప్రపంచాన్ని శాసించిన ఎందరో మహనీయుల స్ఫూర్తిదాయక కథలు మనకు నిలువెత్తు సాక్ష్యాలుగా కనిపిస్తాయి. కల్నల్ శాండర్స్ అనే ఒక సామాన్య వ్యక్తి తన అరవై ఏళ్ల సుదీర్ఘ వయసులో, విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో తన వినూత్న చికెన్ వంటకాన్ని వీధుల్లో అమ్మడం ప్రారంభించాడు. ఆ పట్టుదలే నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది మెచ్చే కేఎఫ్‌సీ సామ్రాజ్య స్థాపనకు పునాది వేసింది. అలాగే, సుప్రసిద్ధ అంతర్జాతీయ రచయిత్రి జె.కె. రౌలింగ్ తీవ్రమైన ఆర్థిక కష్టాలు, ఒంటరితనం, మానసిక సమస్యలను అనుభవిస్తూ ముప్పై ఏళ్ల వయసు దాటాక మాత్రమే హ్యారీ పాటర్ అనే అద్భుత నవలను ప్రపంచానికి పరిచయం చేశారు. మన తెలుగు నేలపైనే చూసుకుంటే, ఎందరో పేద రైతు బిడ్డలు, సాధారణ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన యువకులు ఆలస్యంగానైనా కష్టపడి చదువు పూర్తి చేసి, సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించి, తమ కుటుంబాల తలరాతలను మార్చిన ఉదాహరణలు అనేకం ఉన్నాయి. వీరందరి జీవితాలు చాటిచెప్పే ఒకే ఒక్క అమూల్యమైన సందేశం సమయం ఎంత ఆలస్యమైనా, అంతర్గత పట్టుదల వదలకపోతే విజయం మీ తలుపు తట్టడం ఖాయం.ఇందుకు అద్భుతమైన ఉదాహరణ చైనా వెదురు మొక్క. ఈ విచిత్రమైన మొక్కను నాటిన మొదటి నాలుగైదు సంవత్సరాల వరకు అది భూమి పైకి కంటికి కనిపించేలా ఏమాత్రం పెరగదు. దానికి నీరు పోస్తూ ఎంత సంరక్షించినా ఎలాంటి మార్పూ కనిపించదు. కానీ, ఆ నిశ్శబ్ద సమయంలో అది భూమి అంతర్భాగంలో అత్యంత లోతుగా, విస్తృతంగా తన వేర్లను బలంగా పాతుకుంటూ ఉంటుంది. ఐదో సంవత్సరం వచ్చేసరికి, అదే వెదురు మొక్క కేవలం కొన్ని వారాల వ్యవధిలోనే ఆకాశమంత ఎత్తుకు అద్భుతంగా పెరిగిపోతుంది. ఆ అనూహ్య వేగవంతమైన పెరుగుదలకు అసలు కారణం, అంతకుముందు ఐదేళ్లపాటు అది నిశ్శబ్దంగా నిర్మించుకున్న బలమైన పునాదే. మనం కూడా మన జీవితాల్లో ఒక్కోసారి అనుకున్న ఫలితాలు వెంటనే రాక నిరాశ చెందుతాం. కానీ, బయటకు కనిపించకపోయినా, లోపల మనం మరింత బలపడుతూనే ఉంటాం. సరైన సమయం వచ్చినప్పుడు, ఆ లోపలి బలమే మనల్ని అనూహ్యమైన ఎత్తులకు తీసుకువెళుతుంది.మన ప్రయాణంలో ఎదురయ్యే ఆలస్యం అనేది ఎప్పటికీ వైఫల్యానికి సంకేతం కాదు. నిజానికి, అది మనం భవిష్యత్తులో సాధించబోయే భారీ విజయానికి మరింత పటిష్టంగా సిద్ధం కావడానికి ప్రకృతి మనకు ప్రసాదించిన ఒక అదనపు సమయం మాత్రమే. ఒక సాధారణ విద్యార్థి ఒక పరీక్షలో మొదటిసారి విఫలమైతే, ఆ తాత్కాలిక వైఫల్యం అతనికి తనలోని లోపాలను, బలహీనతలను స్పష్టంగా గుర్తించే గొప్ప అవకాశాన్ని ఇస్తుంది. మలిసారి అతను మరింత పటిష్టమైన, వ్యూహాత్మకమైన సన్నద్ధతతో రంగంలోకి దిగుతాడు. అదే విధంగా, జీవితంలో ఆలస్యంగా విజయాలను అందుకున్నవారు తమ సుదీర్ఘ ప్రయాణంలో ఎదురైన ప్రతి అడ్డంకి నుంచి, ప్రతి ఓటమి నుంచి ఏదో ఒక విలువైన పాఠాన్ని నేర్చుకుంటూనే ఉంటారు. వారు సాధించిన ఆఖరి విజయం వెనుక, సమాజంలో తొందరగా విజయం సాధించిన వారికి ఎప్పటికీ లభించని పరిపక్వత, నిలకడైన ఓర్పు, లోతైన లోకజ్ఞానం దాగి ఉంటాయి. అందుకే, ఆలస్యంగా దక్కిన ఆ విజయం ఎంతో స్థిరంగా, సమాజానికి మరింత అర్థవంతంగా మారుతుంది.మనలో చాలామంది నిరంతరం పక్కవారితో, ఎదుటివారి తాత్కాలిక విజయాలతో మనల్ని మనం పోల్చుకుంటూ తీవ్రమైన మానసిక వేదనను కొనితెచ్చుకుంటూ ఉంటాం. కానీ, ప్రతి ఒక్క మనిషి జీవితం ఒక విలక్షణమైన, ప్రత్యేకమైన నవల వంటిది. ఒక అద్భుతమైన పుస్తకంలోని రెండవ అధ్యాయం, మరొకరు రాసిన పుస్తకంలోని పదవ అధ్యాయం కంటే చాలా నెమ్మదిగా సాగుతుందని భావించి, దానిని ఒక విఫలమైన నవలగా కొట్టిపారేయలేం కదా! అలాగే, దేవుడు మనకు ప్రసాదించిన ఈ అమూల్యమైన జీవిత గమనాన్ని వేరొకరి గమనంతో పోల్చి అంచనా వేయడం మనకు మనమే చేసుకునే అతిపెద్ద అన్యాయం అవుతుంది. మనం నిత్యం చేయవలసింది ఒక్కటే నిన్నటి మనకంటే, ఈరోజు మనం ఎంత మెరుగ్గా ఉన్నాం అని నిరంతరం ప్రశ్నించుకోవడం. మనం సాధించే ఆ చిన్న చిన్న సానుకూల పురోగతులే మనల్ని చివరకు మన అత్యున్నత గమ్యానికి చేరుస్తాయి.కాబట్టి, ప్రియమైన పాఠకులారా, ప్రస్తుత జీవితంలో మీరు ఏ స్థితిలో ఉన్నా, మీ కలల లక్ష్యం ఇంకా చాలా దూరంగా ఉన్నట్టు అనిపించినా, మీరెప్పుడూ అధైర్యపడి నిరాశ చెందవలసిన అవసరం లేదు. ఈ అనంత సృష్టిలో ప్రతి ఒక్క పువ్వుకూ దాని స్వంత వికసన సమయం, ప్రత్యేకమైన కాలం ఖచ్చితంగా ఉంటాయి. మీ సమయం ఇంకా రాలేదంటే, దానికి అర్థం మీరు విఫలమయ్యారని కాదు, మీరు భవిష్యత్తులో ఒక మహా వృక్షంలా మారడానికి ఇంకా సిద్ధమవుతున్నారని అర్థం. నిలకడగా ఓపిక వహించండి, నిరంతరం శ్రమించండి, మీ ఆత్మవిశ్వాసాన్ని ఎక్కడా కోల్పోకండి. ఆలస్యంగానైనా సరే మీరు ఒకరోజు పరిపూర్ణంగా వికసించినప్పుడు, మీ విజయ పరిమళం యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తుంది. ఎందుకంటే, చివరకు చరిత్రలో మిగిలేది మనం సమాజంలో ఎప్పుడు పూచామన్నది కాదు, ఎంత గొప్పగా వికసించామన్నదే ముఖ్యం! మీ అద్భుత విజయ వసంతం కోసం ఈ ప్రపంచం తప్పకుండా ఎదురొచ్చి స్వాగతం పలుకుతుంది.

## హైడ్రాపై పోలీస్ అధికారి పాట.. పుట్టినరోజున
# ఆవిష్కరించిన కమిషనర్ ఏవీ రంగనాథ్

- హైదరాబాద్ నగరంపై రూపొందించిన అవగాహన గీతం విడుదల
- హైడ్రా రాకతో నగరంలో వచ్చిన మార్పును వివరిస్తూ పాట
- ఈ గీతాన్ని ఆలపించిన రాంగోపాల్‌పేట సీఐ బోడసింగి సురేశ్ కుమార్
- కమిషనర్ ఏవీ రంగనాథ్ తన పుట్టినరోజున ఈ పాటను ఆవిష్కరించారు
- సీఐ సురేశ్ కుమార్ ప్రయత్నాన్ని కమిషనర్ అభినందించిన వైనం



విధి నిర్వహణలో బాధ్యతగా ఉంటూనే, తనలోని కళతో సామాజిక చైతన్యానికి పాటుపడుతున్నారు రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బోడసింగి సురేశ్ కుమార్. హైదరాబాద్ నగరంలో 'హైడ్రా' రాకతో వచ్చిన మార్పును వివరిస్తూ ఆయన ఆలపించిన ఓ ప్రత్యేక గీతాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం ఆవిష్కరించారు. కమిషనర్ రంగనాథ్ జన్మదినం సందర్భంగా ఆయన చేతుల మీదుగా ఈ పాటను విడుదల చేయడం విశేషం. గతంలో హైదరాబాద్ నగరం ఎలా ఉండేది, ఆక్రమణల వల్ల వరదలతో ఎలా మునిగిపోయేది, ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రైనేజీ కాలువలు ఎలా పూడుకుపోయాయో ఈ పాటలో వివరించారు. హైడ్రా వచ్చిన తర్వాత నగరం ఎలా సురక్షితంగా మారిందనే అంశాన్ని సురేశ్ కుమార్ తన గాత్రంతో ఆకట్టుకునేలా ప్రస్తావించారు. సురేశ్ కడారి రాసిన ఈ పాటకు కల్యాణ్ కీస్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, సీఐ సురేశ్ కుమార్ ప్రయత్నాన్ని అభినందించారు. విధులను నిర్వర్తిస్తూనే, పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ప్రశంసనీయమని అన్నారు.

# పరీక్షల్లో పాసయ్యేదెవరు?

**ఇన్వెస్టర్లు గమనించాల్సిన ఫస్ట్‌క్లాస్ కంపెనీలేంటి?**

**ఎక్కువ పరీక్షలు చేసినంత మాత్రాన లాభాలొస్తాయా?**

**పాథాలజీ, రేడియాలజీ... దేంట్లో ఎక్కువ లాభాలున్నాయి?**

**డాక్టర్ లాల్ పాథ్‌ల్యాబ్స్, మెట్రోపోలిస్ దేనికవే ప్రత్యేకం**

**ఆఫ్‌లైన్ సెంటర్లతో మెరుగైన మార్జిన్లు సాధిస్తున్న విజయ**

**ప్రభుత్వ నెట్‌వర్క్‌తో కలిసి ఎదుగుతున్న క్రిస్నా**

**తక్కువ ఖర్చులతో టెస్టుల కర్మాగారంగా మారిన థైరోకేర్**

**మరో మూడు ప్రత్యేక కంపెనీలూ ఉన్నాయ్**



గడిచిన దశాబ్దంలో వైద్య పరీక్షలు తెచ్చిన విప్లవం అంతా ఇంతా కాదు. ఇపుడు చాలా పరీక్షలకు ఆసుపత్రులో, దయాగ్నస్టిక్ సెంటర్లో అవసరం లేదు. ఇంటికే వచ్చి శాంపిల్స్ తీసుకుంటారు. కొన్ని పరీక్షలు అక్కడే చేసేస్తున్నారు!!. అంతేకాదు. అనారోగ్యం వస్తేనే పరీక్షలు చేయించుకునే కాలం పోయింది. ఎలాంటి సమస్యలూ లేకున్నా... ప్రతి ఆరు నెలలకో, ఏడాదికో ప్రివెంటివ్ చెకప్ చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. వీటన్నింటి ఫలితమే... మన దయాగ్నస్టిక్స్ మార్కెట్ ఇపుడు రూ.లక్ష కోట్లు దాటేసింది. మరి ఈ రంగంలో విన్నర్ ఎవరు? చాలా దయాగ్నస్టిక్ సెంటర్లు లిస్టవుతున్న ఈ పరిస్థితుల్లో ఎవరి పనితీరు ఎలా ఉంది? ఇన్వెస్టర్లు ఎలాంటి కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయాలి? ఇవన్నీ వివరించేదే ఈ 'హెల్త్‌కేర్ ఎకానమీ పార్ట్--3'. ఓ మాలిక్యులర్ పరీక్షతో ఇన్ఫెక్షన్ స్థాయిని తెలుసుకోవచ్చు.

ఇదీ... ఆరోగ్య రంగంలో దయాగ్నోస్టిక్స్ పోషిస్తున్న పాత్ర. కాకపోతే ఇన్వెస్టర్లు చూడాల్సిన అత్యంత ప్రధానమైన అంశం మరొకటుంది. అది... ఈ రంగం ఏటా 20--24 శాతం పెరుగుతుండటం. మరి ఆ పెరిగే మార్కెట్‌తో లబ్ధి పొందేదెవరు? ఎక్కువ పరీక్షలు చేసేదెవరు?

గడిచిన ఐదేళ్లలో దయాగ్నోస్టిక్ రంగంలో పోటీ విపరీతంగా పెరిగింది. ధరలు ఎక్కడ తక్కువుంటే అక్కడికే జనం వెళు తుండటంతో... పెద్దగా ధరలు పెంచే పరిస్థితి లేదు. దీంతో ఎక్కువ పరీక్షలు చేసేవారికే ఎక్కువ రెవెన్యూ... ఎక్కువ లాభాలు అనే పరిస్థితి ఏర్పడింది. అలాగని ఎక్కువ సెంటర్లు పెడితే లాభాలపై ప్రభావం పడుతోంది. కాబట్టి తక్కువ సెంటర్లతోనో, ఇంటిదగ్గరే శాంపిల్స్ తీసుకునే మోడల్‌తోనో ఎక్కువ పరీక్షలు చేసే కంపెనీలే విజేతలుగా నిలవబోతున్నాయి.

### విజయ డయాగ్నస్టిక్స్... మార్జిన్లలో ఆధిపత్యం

ఈ గ్రూపులో ఎక్కువగా దృష్టి పెట్టాల్సిన కంపెనీ ఇదేనని చెప్పొచ్చు. ఎందుకంటే పాథాలజీపైనే ఫోకస్ పెట్టిన డాక్టర్ లాల్ పాథ్‌ల్యాబ్స్ మాదిరి కాకుండా... హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఈ కంపెనీ పాథాలజీ, రేడియోలజీ రెండింట్లోనూ తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ వస్తోంది. సీటీ, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే, పాథాలజీ వంటివన్నీ ఉన్న ఆల్‌రౌండర్‌గా ఈ సంస్థను చూడొచ్చు. నిజానికి రేడియోలజీ వల్ల ఆర్థికాంశాలు పూర్తిగా మారిపోతాయి. ఎందుకంటే బ్లడ్ శాంపిల్‌ను ఒకచోట సేకరించి మరోచోటికి పంపించవచ్చు కానీ... ఎంఆర్ఐ కోసం వచ్చిన పేషెంట్‌ను బ్లడ్ శాంపిల్ మాదిరి రవాణా చేయలేం. రేడియోలజీ పరికరాలు పేషెంట్లకు చేరువలో ఉండాల్సిందే. అప్పుడే ఎక్కువ మంది వస్తారు. కానీ దీనికి పెట్టుబడులూ ఎక్కువే కావాలి. కాకపోతే ఎక్కువ పేషెంట్లొచ్చి వాడకం పెరిగే కొద్దీ ఈ రేడియోలజీ తెచ్చే లాభాలు చాలా ఎక్కువ. ఈ విషయాన్ని విజయ దయాగ్నస్టిక్స్ తాజా ఫలితాలు చూసి అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో విజయ రెవెన్యూ ఏకంగా 22.8 శాతం... అంటే రూ.231 కోట్లు పెరిగింది. ఎబిటా ఏకంగా 34 శాతం పెరిగి రూ.99 కోట్లకు చేరింది. నికరలాభం కూడా 37.6 శాతం పెరిగి రూ.53 కోట్లకు చేరింది. అన్నిటికన్నా ముఖ్యం... మార్జిన్ల శాతం. ఎబిటా మార్జిన్ ఏకంగా 42.7 శాతానికి చేరింది. ఇది గతేడాది 39.1 శాతంగా ఉంది. అంటే... ప్రస్తుతం అన్నిచోట్లా కేంద్రాలున్నాయి. పరికరాలున్నాయి. వీటికి మరింత మంది పేషెంట్లు జతవుతున్నారు. ఇప్పటికే యంత్రాలను కొనుగోలు చేసిన నేపథ్యంలో వాటి వాడకం పెరుగుతోంది. అది లాభాల్ని పెంచుతోంది. నిర్వహణ పరంగా మెరుగైన స్థాయిని సాధించటమంటే ఇదే. పరీక్షా కేంద్రాలను పెంచటం కాదు... వాటిని ఏ స్థాయిలో వాడుతున్నామన్నది ముఖ్యం. విజయ విషయంలో కలిసి వస్తున్నది ఇదే.

### క్రిస్నా... ఇదో విభిన్నమైన సంస్థ

ఈ సంస్థ ప్రత్యేకత పీపీపీ నమూనాయే. ఎందుకంటే పాథాలజీ, రేడియోలజీ సేవలందించడానికిది ప్రభుత్వాలతోను, ప్రభుత్వ ఆసుపత్రులతోను ఒప్పందాలు చేసుకుంది. ప్రత్యేకించి టైర్--2, టైర్--3 పట్టణాల్లో. దీనివల్ల ఈ సంస్థకు పేషెంట్ల తాకిడి చాలా ఎక్కువ. కానీ ప్రైవేటు మార్కెట్ రేట్లతో పోలిస్తే ఇది వసూలు చేసే రేట్లు చాలా తక్కువ. కాబట్టి క్రిస్నా సంస్థ మిగతా కంపెనీలకన్నా ఎక్కువ పరీక్షలు చేస్తూ ఉండొచ్చు.

### థైరోకేర్... పరీక్షల కర్మాగారం

ఈ కంపెనీది వినూత్నమైన మోడల్. ఎక్కడికక్కడ వేలాది ల్యాబొరేటరీలతో విస్తరించిన దయాగ్నస్టిక్స్ కంపెనీ కాదిది. ప్రధానమైన అన్ని ప్రాంతాల్లోనూ శాంపిల్స్‌ను సేకరించే వేలాది మందితో అనుసంధానమై విస్తరించిన పరీక్షల కర్మాగారమిది. ఆటోమేషన్‌తో పాటు భారీ ఎత్తున ప్రాసెసింగ్ చేయగలిగిన సామర్థ్యం ఈ కంపెనీ సొంతం. దీనివల్ల ప్రతి టెస్ట్‌కూ అయ్యే ఖర్చులు తక్కువ. శాంపిల్ సేకరణను ఎక్కడికక్కడ ఫ్రాంచైజీ తరహాలో వ్యక్తులకు అప్పగించటమనే కొత్త విధానానికీ శ్రీకారం చుట్టిందీ సంస్థ. ఇవన్నీ కలిసి 2026 మూడవ త్రైమాసికంలో కంపెనీ ఆదాయాన్ని 18 శాతం పెంచి రూ.196 కోట్లకు చేర్చాయి. ఎబిటా మార్జిన్ దాదాపుగా 34 శాతం ఉంది. ఆటోమేషన్ కారణంగా సంస్థ ఎక్కువ శాంపిళ్లను ప్రాసెస్ చేయగలుగుతోంది. కాకపోతే దీనికి సవాళ్లూ ఉన్నాయి. అందులో ప్రధానమైంది ధరల్లో పోటీ. ఎక్కువ పరీక్షలు చేయగలుగుతోంది కానీ... పోటీ కారణంగా ఎక్కువ ధరల్ని నిర్ణయించలేకపోతోంది. ఇన్వెస్టర్లు ఈ సంస్థ పరీక్షల సంఖ్యతో పాటు ప్రతి టెస్ట్‌కూ వస్తున్న రెవెన్యూను కూడా గమనించాల్సి ఉంటుంది. దయాగ్నస్టిక్స్ రంగం ఎలా మారుతోందో తెలియజేయడానికి 3బీ బయో సరైన ఉదాహరణ. ఎందుకంటే ఇది శాంపిళ్లను సేకరించే సంప్రదాయ కంపెనీ కాదు. మాలిక్యులర్ దయాగ్నోస్టిక్స్, దయాగ్నస్టిక్ ఉత్పత్తుల కంపెనీ. కాబట్టి ఎలాంటి ఉత్పత్తులను మార్కెట్లోకి తెస్తోంది? మాలిక్యులర్ టెస్టింగ్ ఏ స్థాయిలో ఉంది? కిట్ల అమ్మకాలు ఎలా ఉన్నాయి? టెక్నాలజీ--ఎగుమతులు-- ఉత్పత్తుల అభివృద్ధి ఏ స్థాయిలో ఉన్నాయి? అన్నవే ఈ కంపెనీ పనితీరును ముందుకు తీసుకెళతాయన్నది ఇన్వెస్టర్లు గమనించాలి.

## పెట్రోల్, డీజిల్ పన్నుల్లో మార్పు!

అంతర్జాతీయ మార్కెట్‌లో.. చమురు ధరల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా భారత ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై పన్నులను సవరించింది. అక్టోబర్ 16 నుంచి పెట్రోల్ ఎగుమతులపై పన్నును లీటరుకు రూ. 0.50 నుంచి రూ. 2.50కు పెంచగా, డీజిల్ ఎగుమతులపై పన్నును రూ. 16 నుంచి రూ. 8.50కు తగ్గించింది. అంటే పెట్రోల్‌పై పన్ను ఐదు రెట్లు పెరిగితే, డీజిల్‌పై రూ. 7.50 తగ్గింది. ఈ కొత్త పన్ను రేట్లు మరో 15 రోజుల పాటు అమల్లో ఉంటాయి. ప్రభుత్వం పెట్రోల్‌పై పన్ను పెంచి, డీజిల్‌పై ఎందుకు తగ్గించిందనే ప్రశ్న చాలామందికి రావచ్చు. దీనికి ప్రధాన కారణం అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న మార్పులు. విదేశాల్లో ఇంధన ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు, చమురు శుద్ధి సంస్థలు దేశీయ మార్కెట్‌లో విక్రయించడం కంటే విదేశాలకు ఎగుమతి చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపవచ్చు. దీనివల్ల దేశంలో ఇంధన సరఫరాపై ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితులను నియంత్రించడానికి ప్రభుత్వం ఎగుమతులపై పన్నులు విధిస్తుంది. నిజానికి.. ప్రభుత్వం ఈ పన్నులను ఒకేసారి నిర్ణయించి, శాశ్వతంగా అమలు చేయడం లేదు. అంతర్జాతీయ ముడి చమురు ధరలు, యుద్ధ పరిస్థితులు, ఇంధన సరఫరాను బట్టి ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తోంది. గతంలో 2024లో విండ్‌ఫాల్ పన్నులను తొలగించిన ప్రభుత్వం, 2026 మార్చిలో పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రం కావడం, చమురు ధరలు పెరగడం వంటి పరిణామాల నేపథ్యంలో మళ్లీ ఎగుమతి పన్నులను ప్రవేశపెట్టింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పెట్రోల్ ధరలు పెరుగుతాయా?, డీజిల్ ధరలు తగ్గుతాయా? అని అనుకోకూడదు. ఎందుకంటే ఈ మార్పులు విదేశాలకు ఎగుమతి చేసే ఇంధనంపై మాత్రమే వర్తిస్తాయి.

## అమెరికా 'లేబర్' షాక్: ఇన్ఫోసిస్ రియాక్షన్ ఇదే..

అమెరికా కార్మిక శాఖ (డీఓఎల్) శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ (పర్మ్) కింద కొత్త, పెండింగ్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను నిలిపివేయడంపై ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ స్పందించింది. ఈ నిర్ణయం వల్ల తమ సంస్థపై గణనీయమైన ప్రభావం ఉంటుందని భావించడం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో వెల్లడించింది. ఈ సస్పెన్షన్ కొన్ని కంపెనీలకు వర్తిస్తుందని పేర్కొన్న ఇన్ఫోసిస్.. అమెరికా అధికారులతో సంప్రదింపులు జరిపేందుకు, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది.

### అమెరికాలో పెట్టుబడులకు కట్టుబడి ఉన్నాం

అమెరికా కార్మిక శాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ సంస్థలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఇన్ఫోసిస్ పేర్కొంది. అమెరికా అంతటా స్థానిక ఉద్యోగ నియామకాలు, సాంకేతిక అభివృద్ధి, ఆవిష్కరణల కేంద్రాల ఏర్పాటులో పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. అమెరికాలోని తమ ఉద్యోగులు, క్లయింట్లు, స్థానిక సమాజాల పట్ల సంస్థ కట్టుబడి ఉందని తెలిపింది. అక్కడ అమల్లో ఉన్న చట్టాలు, నిబంధనలను పూర్తిస్థాయిలో పాటిస్తామని స్పష్టం చేసింది. అవసరమైతే నిబంధనలకు అనుగుణంగా మరిన్ని వివరాలను వెల్లడిస్తామని పేర్కొంది.




### వలస నిబంధనల మార్పులపై ఆందోళన

అమెరికాలో వలస నిబంధనల్లో మార్పులు తమ వ్యాపార అంచనాలపై ప్రభావం చూపే అంశాల్లో ఒకటని ఇన్ఫోసిస్ తెలిపింది. ప్రతిభావంతులైన ఉద్యోగుల కోసం పెరుగుతున్న పోటీ, సిబ్బందిని నియమించుకోవడం, కొనసాగించడం, వేతనాల పెరుగుదల, ఉద్యోగులకు కొత్త నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వడం వంటి అంశాలను కూడా ప్రస్తావించింది. ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ పరిణామాలు, సాంకేతిక మార్పులు, సైబర్ భద్రతా సమస్యలు, పెండింగ్ కేసులు, అమెరికా ప్రభుత్వ దర్యాప్తులు, ప్రస్తుత-భవిష్యత్ సుంకాలు సైతం సంస్థ వ్యాపారంపై ప్రభావం చూపే ప్రమాదాలుగా పేర్కొంది.

### పూర్తి వివరాలు వెల్లడించని కంపెనీ

లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తుల నిలిపివేతకు సంబంధించి ఎన్ని దరఖాస్తులు ప్రభావితమయ్యాయి, ఈ నిర్ణయం ఎంతకాలం కొనసాగుతుంది, దీని వెనుక కారణాలేమిటనే వివరాలను ఇన్ఫోసిస్ వెల్లడించలేదు. మరోవైపు, ఈ నిర్ణయం వల్ల కలిగే ప్రభావంపై సంస్థ చేసిన అంచనాలు భవిష్యత్తుకు సంబంధించినవని, వాటిలో అనిశ్చితులు ఉన్నాయని ఫైలింగ్‌లో హెచ్చరించింది. వాస్తవ ఫలితాలు ప్రస్తుత అంచనాలకు భిన్నంగా ఉండవచ్చని తెలిపింది. ఈ నేపథ్యంలో మార్చి 31, 2026తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికతో పాటు అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ)కు సమర్పించిన ఇతర పత్రాలను పరిశీలించాలని పెట్టుబడిదారులకు సూచించింది. అమెరికాలో శాశ్వతంగా పనిచేయడానికి విదేశీ ఉద్యోగులకు గ్రీన్ కార్డు (+తీవవఅ ఝుతీస) ప్రక్రియలో ఉపయోగపడే ఉద్యోగ ఆధారిత మార్గాల్లో పర్మ్ ఒకటి. ఈ ప్రక్రియలో సాధారణంగా సంబంధిత ఉద్యోగానికి అర్హులైన అమెరికా కార్మికులు అందుబాటులో లేరని, విదేశీ ఉద్యోగిని నియమించడం వల్ల స్థానిక కార్మికుల వేతనాలు, పని పరిస్థితులపై ప్రతికూల ప్రభావం ఉండదని యజమాని నిరూపించాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికేషన్ ప్రక్రియ నిలిచిపోవడం వల్ల కొత్త దరఖాస్తులతో పాటు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపైనా ప్రభావం పడే అవకాశం ఉంది.

## రూ.2 లక్షల జీతం.. అయినా కష్టాలే!

సాధారణంగా నెలకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల జీతం అంటే చాలామందికి మంచి ఆదాయమే. ఇలాంటి జీతం వస్తే హాయిగా జీవించొచ్చని అనుకుంటారు. కానీ.. పెద్ద నగరాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటుందని ఓ మహిళ చెబుతోంది. నెలకు రూ.1-2 లక్షలు సంపాదిస్తున్నా.. ఖర్చులు పోగా చేతిలో పెద్దగా డబ్బు మిగలడం లేదని పేర్కొంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**ఏమిటీ 'శాలరీ ట్రాప్'**

ఇన్‌స్టాగ్రామ్‌లో నిధి కుష్వాహ్ అనే మహిళ ఈ విషయంపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. టైర్-1 నగరాల్లో నెలకు రూ.1-2 లక్షలు సంపాదించే వాళ్లు కూడా ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆమె చెప్పిన లాజిక్ కూడా చాలామందికి కనెక్ట్ అవుతోంది. ఈ జీతం తక్కువ ఆదాయంతో జీవించే స్థాయి నుంచి బయటపడటానికి సరిపోతుంది. కానీ.. ఖరీదైన జీవనశైలిని ఎలాంటి ఆలోచన లేకుండా కొనసాగించడానికి మాత్రం సరిపోదు. అంటే.. జీతం బాగానే ఉంటుంది, కానీ నెలాఖరుకు బ్యాంక్ బ్యాలెన్స్ చూస్తే మాత్రం నిరాశే మిగులుతుంది.

**పెద్ద నగరాల్లో ఖర్చులు**

ఇక్కడ ప్రధాన సమస్య జీవన వ్యయం. టైర్-1 నగరాల్లో ఇంటి అద్దె ఒక్కటే జీతంలో పెద్ద భాగాన్ని తీసుకుపోతుంది. దానికి తోడు కరెంట్, ఇంటి ఖర్చులు, కారు లేదా బైక్ ఈఎంఐ, పెట్రోల్, పిల్లల స్కూల్ ఫీజులు, వైద్యం, బయట తినడం, షాపింగ్ ఇలా ఒక్కో



ఖర్చు కలుస్తూ పోతుంది. ఉదాహరణకు నెలకు రూ.1.5 లక్షలు జీతం వస్తే.. అందులో రూ.30-40 వేలు ఇంటి అద్దెకే వెళ్లొచ్చు. పిల్లలున్న కుటుంబాల్లో స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులు అదనంగా ఉంటాయి. కారు ఈఎంఐ లేదా హోమ్ లోన్ ఉంటే మరో పెద్ద మొత్తం అక్కడే పోతుంది. చివరికి పొదుపు చేయడానికి అనుకున్న డబ్బు చాలా తక్కువగా మిగలొచ్చు.

**జీతం పెరిగితే ఖర్చులు కూడా**

ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లేషన్. జీతం పెరిగినప్పుడు మన అవసరాలు మాత్రమే కాదు.. మన కోరికలు కూడా పెరుగుతాయి.

మంచి జీతం రావడంతో ఖరీదైన ఇల్లు, కొత్త కారు, ఎక్కువ ట్రావెల్స్, రెస్టారెంట్లు, బ్రాండెడ్ వస్తువులు ఇలా ఖర్చులు పెరగొచ్చు. మొదట్లో ఇవన్నీ చిన్న ఖర్చుల్లానే అనిపిస్తాయి. కానీ నెలాఖరుకు చూస్తే మొత్తం పెద్దదైపోతుంది. అందుకే కొంతమందికి జీతం రూ.80 వేల నుంచి రూ.1.5 లక్షలకు పెరిగినా.. పొదుపు మాత్రం పెద్దగా పెరగదు.

**ఇతరులతో పోల్చుకోవడం మరో సమస్య**

సోషల్ మీడియా వల్ల ఈ సమస్య మరింత పెరుగుతోందని కొందరు అభిప్రాయపడుతున్నారు. మన చుట్టూ ఉన్నవాళ్లు కొత్త కారు కొంటున్నారు, విదేశాలకు వెళ్తున్నారు, ఖరీదైన రెస్టారెంట్లకు వెళ్తున్నారు అని చూసి మనం కూడా అదే స్థాయిలో జీవించాలనుకుంటాం. కానీ వాళ్ల ఆదాయం ఎంత?, వాళ్ల అప్పులు ఎంత?, వాళ్లు ఎంత పొదుపు చేస్తున్నారు?, అనేది మనకు తెలియదు. అయినా వాళ్ల జీవనశైలిని చూసి మన ఆర్థిక పరిస్థితికి సరిపోని ఖర్చులు చేస్తే సమస్యలు మొదలవుతాయి.

**నెటిజన్ల స్పందన**

నిధి కుష్వాహ్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు వచ్చాయి. కొందరు ఆమె చెప్పింది నిజమేనని అన్నారు. తమ స్నేహితులు కూడా ఇలాంటి ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని కొందరు చెప్పారు. అయితే.. మరికొందరు మాత్రం సమస్య జీతంలో కంటే మన ఖర్చు చేసే విధానంలో ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

## కార్పొరేట్ కొనుగోళ్లు రెట్టింపు

**2017 నుంచి 2026 వరకూ క్రిసిల్ నివేదిక**

ముంబై: ఇతర కంపెనీల కొనుగోళ్లలో దేశీ కార్పొరేట్ దిగ్గజాలు భారీ ఆసక్తి చూపుతున్నట్లు దేశీ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ తాజా నివేదికలో పేర్కొంది. 2016--17 ఆర్థిక సంవత్సరం నుంచి చూస్తే కొనుగోళ్లు రెట్టింపైనట్లు వెల్లడించింది. అయితే వీటిలో మూడోవంతు అనుకున్న ఫలితాలు సాధించలేకపోయినట్లు తెలియజేసింది. విభిన్న కారణాలతో కంపెనీలు ఇతర సంస్థల కొనుగోళ్లను చేపడుతున్నట్లు క్రిసిల్ ఎండీ సుబోధ్ రాయ్ తెలియజేశారు. వృద్ధిని పెంచుకోవడంలో వేగం, మార్కెట్లలో మరింత విస్తరించడం, కొనుగోళ్ల సామర్థ్యాలకు పదును పెట్టుకోవడం తదితరాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. నివేదిక విశ్లేషణ ప్రకారం 2017 నుంచి డీల్స్ సంఖ్య రెట్టింపైంది. 20 రంగాల నుంచి విడిగా రూ. 500 కోట్లకుపైగా విలువైన 600 డీల్స్‌ను నివేదిక విశ్లేషించింది. అయితే విశ్లేషణలో ఫైనాన్షియల్ సర?వసులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలలోని లావాదేవీలను మినహాయించింది. ప్రయివేట్ ఈక్విటీ(పీఈ) దిగ్గజాలు దేశీయంగా చేపట్టే డీల్స్‌కు సైతం చోటివ్వలేదు.

**కారణాలు వేరువేరు..**

క్రిసిల్ నివేదిక ప్రకారం ఫార్మాస్యూటికల్స్, హెల్త్‌కేర్, ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కన్జూమర్ బిజినెస్‌లు టెక్నాలజీల అనుసంధానం, నైపుణ్యాలు, మేథోసంపత్తిని సమకూర్చుకోవడం తదితరాల కోసం కొనుగోళ్లను చేపడుతున్నాయి. సిమెంట్, మెటల్స్ రంగాలలోని పరిశ్రమలు.. కన్సాలిడేషన్, ప్లాంట్ల నిర్మాణ సమయాన్ని తగ్గించుకోవడం తదితరాలపై దృష్టితో కొనుగోళ్లకు తెరతీస్తున్నాయి. తద్వారా 4--6 ఏళ్ల కాలాన్ని ఏడాది నుంచి మూడేళ్లకు తగ్గించుకుంటున్నాయి. రుణ సమీకరణతో చేపట్టిన 100కుపైగా భారీ డీల్స్ మూడింటిలో రెండు అంచనాలను అందుకున్నట్లు రాయ్ పేర్కొన్నారు. కొన్ని డీల్స్ ఏకీకృతంకావడంలో విఫలంకాగా.. నియంత్రణ సంస్థల ఆలస్యాలు, దేశ సరిహద్దులనుదాటి(క్రాస్‌బోర్డర్) చేపట్టే కొనుగోళ్లు కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నట్లు వివరించారు. కొనుగోళ్లు, విలీనాలనేవి వ్యూహాత్మక నిర్ణయాలతోనే విజయవంతంకాబోవని, క్రమశిక్షణాయుత ఏకీకృత చర్యలు, సమయానుగుణంగా సొంతం చేసుకోవడం, వనరుల సమర్థవంత వినియోగం తదితరాలు ఇందుకు సహకరించనున్నట్లు అభిప్రాయపడ్డారు.



# ఈ రుక్మిణి మహా కోపిష్టి!

కృష్ణ గణితశాస్త్ర ఉపాధ్యాయుడు. మంచి రచయిత కూడా. అయితే ఆయన రాసే కథలన్నీ భార్య రుక్మిణి పేరుతో ప్రచురితమవుతుంటాయి. ఈ ప్రేమకథలకు పాఠకుల్లో మంచి ఆదరణ లభిస్తుంటుంది. అయితే భార్య పేరుమీద కృష్ణ కథలు ఎందుకు రాస్తున్నాడు? రుక్మిణి పాత్ర వెనకున్న రహస్యమేమిటి? ఈ వివరాలు తెలుసుకోవాలంటే 'అలియాస్ రుక్మిణి' సినిమా చూడాల్సిందే అంటున్నారు మేకర్స్. నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవపోత్ దర్శకత్వం వహిస్తున్నారు. అగ్ర హీరో నాని సమర్పణలో ఆయన సోదరి దీప్తి గంటా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ నటి ఆఫియా సయ్యద్ కథానాయికగా నటిస్తున్నది. స్కూల్ టీచర్ రుక్మిణి పాత్రలో ఆమెను పరిచయం చేస్తూ ఫస్ట్ గ్లింప్స్‌ని విడుదల చేశారు. ఈ వీడియోలో విద్యార్థులు ఆమెను హిట్లర్, హోంవర్క్ పోలీస్ వంటి పేర్లతో పిలుస్తుంటారు. చక్కటి అందం, అంతకుమించిన కోపిష్టి స్వభావంతో రుక్మిణి పాత్రను ప్రజెంట్ చేశారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుందని, ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ తెలిపారు.

# ఎమోషనల్ లవ్‌స్టోరీకి సిద్ధం



గత రెండేళ్లుగా వరుస యాక్షన్ సినిమాలతో సందడి చేస్తూ వచ్చారు హీరో నాని. దసరా, హిట్ 3, ది ప్యారడైజ్.. ఇలా మాస్ యాక్షన్ మోడ్‌లో ఆయన చేసిన సినిమాలన్నీ భారీ విజయాలను అందుకున్నాయి. ప్రస్తుతం సుజీత్ దర్శకత్వంలో నటిస్తున్న 'బ్లడీరోమియో' సినిమాలో కూడా కొంతమేర యాక్షన్ ఉంటుందని తెలుస్తున్నది. ఇదిలావుంటే.. ఈ సినిమా తర్వాత నుంచి కథల ఎంపిక విషయంలో నాని పంథా మార్చనున్నారట. యాక్షన్ కథలను పక్కనపెట్టి, మనసుల్ని మెలిపెట్టే భావోద్వేగపూరితమైన కథాంశాలపై ఆయన దృష్టిసారించనున్నట్టు అంతరంగిక వర్గాల భోగట్టా. ఈ క్రమంలోనే మధురమైన జ్ఞాపకాలను, చెప్పుకోలేని భావాలను తెరపై అద్భుతంగా ఆవిష్కరించే తమిళ దర్శకుడు ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో ఆయన ఓ ఎమోషనల్ ప్రేమకథలో నటించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. 96, సత్యం సుందరం చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు డైరెక్టర్ ప్రేమ్ కుమార్. త్వరలో ఆయన నానితో చేయబోతున్న సినిమా కూడా భావోద్వేగాల మేళవింపుగా ఉంటుందని సమాచారం. ఈ ఎమోషనల్ లవ్‌స్టోరీలో కథానాయిక పాత్ర కీలకమని టాక్. అందుకే ఆ పాత్ర కోసం చాలామంది కథానాయికలను పరిశీలించిన చిత్రబృందం చివరకు రుక్మిణి వసంత్‌ను ఖరారు చేసినట్లు తెలిసింది. ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించనున్న ఈ సినిమాకు సంబంధించిన అధికార ప్రకటన రావాల్సివుంది.

# అమ్మమాట నిజమైంది



'ఈ సినిమాలోని ఉదయ్ పాత్రకు నేను కన్ఫర్మ్ అవ్వగానే.. డైరెక్టర్ భద్రప్ప నాకు ఫుల్ స్క్రిప్ట్ పంపారు. చదివి బాగా ఎంజాయ్ చేశాను. ఇందులోని ప్రతి పాత్ర హిలేరియస్‌గా అనిపించింది' అని హీరో అఖిల్‌రాజ్ అన్నారు. నరేశ్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్‌భాస్కర్‌తో కలిసి ఆయన నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'. భద్రప్ప గాజుల దర్శకుడు. ఈ నెల 16న విడుదల కానున్నది. అఖిల్‌రాజ్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు.'అనుపమ హీరోయిన్‌గా చేసిన 'రౌడీబాయ్స్'లో చిన్న పాత్ర చేశాను. ఆ సినిమా చూసిన మా అమ్మ..'నువ్వు హీరో అయ్యాక ఈ అమ్మాయితో నటించు' అన్నది. ఈ సినిమాతో అమ్మమాట నిజమైంది' అన్నారు. 'క్రేజీ కల్యాణం' ప్రతి ఊరిలో, ప్రతి ఇంట్లో జరిగే కథ అని, ప్రతి ఒక్కరి జీవితాలకు దగ్గరగా సినిమా ఉంటుందని, తెలంగాణ సంస్కృతి నేపథ్యంలో తీసిన సినిమానే అయినా.. అన్ని ప్రాంతాలవారికీ కనెక్టయ్యే ఎమోషన్స్ ఈ సినిమాలో ఉంటాయని అఖిల్‌రాజ్ చెప్పారు.

# అతీంద్రియ రహస్యాల కథ



ఆది సాయికుమార్ కథానాయకుడిగా కొత్త సినిమా ప్రకటన వెలువడింది. డివైన్ మిస్టరీ, సస్పెన్స్ ప్రధానంగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి నవరసన్ దర్శకత్వం వహిస్తారు. త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై పాన్ ఇండియా స్థాయిలో ప్రశాంత్ జి రుద్రప్ప నిర్మిస్తున్నారు. 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్నంది స్తున్నారు.అంతుచిక్కని దైవిక రహస్యాల నేపథ్యంలో ఆధ్యాత్మికత, విశ్వాసం, ప్రాచీన నమ్మకాలు ప్రధానాంశాలుగా ఓ సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ ఈ సినిమా సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఇదొక అతీంద్రియ రహస్యాల కథ అనే విషయాన్ని ధృవీకరిస్తున్నది. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ బి లోక్‌నాథ్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: నవరసన్.



# 'రణబాలి'తో వారందరికీ సమాధానమిస్తా..

'పండుగ మొదలైంది. తిరుపతిలో బ్రహ్మోత్సవాలు, బెజవాడలో శరన్నవరాత్రులు, తెలంగాణలో బతుకమ్మ సంబరాలు స్టార్టయ్యాయి. పిల్లలకు సెలవులిచ్చారు. ఈ నెల 16న తెలుగు సినిమా గర్వపడేలా 'రణబాలి' రానుంది. థియేటర్లన్నీ పండుగ సంబురాలతో కళకళలాడాలి. ఈ కథ కోసం ఓ రీసెర్చే చేశారు రాహుల్ సంకృత్యాన్. ఓ పీరియడ్ యాక్షన్ సినిమాను చూపిస్తూ, మరుగున పడ్డ చరిత్రను తెరపై ఆవిష్కరించాడు. 150 ఏండ్ల క్రితం బ్రిటిషర్స్ వల్ల వచ్చిన మహాకరువు లక్షలమంది చావులకు కారణం అయ్యింది. ప్రస్తుతం కూడా ఎల్‌నినో వల్ల కరువు వచ్చే అవకాశం కనిపిస్తున్నది. అందుకే నీళ్లను జాగ్రత్తగా వాడదాం. ఎన్ని కష్టాలనైనా అధిగమించే శక్తి భారతీయులకు మొదట్నుంచీ ఉంది. నా 'నోటా' సినిమా సరిగ్గా ఆడకపోవడంతో అప్పట్లో కొందరు నన్ను ట్రోల్ చేశారు. అప్పుడు రాహుల్ సంకృత్యాన్ 'ట్యాక్సీవాలా'తో వాళ్లందరికీ సమాధానమిచ్చా. ప్రస్తుతం మళ్లీ ట్రోల్స్ మొదలయ్యాయి. ఇప్పుడు రాహుల్ సంకృత్యాన్ 'రణబాలి'తో వస్తున్నా. ఈ సారి కూడా వారందరికీ సమాధానమిస్తా. నటీనటులు, సాంకేతికనిపుణులు అంతా ప్రాణం పెట్టి పనిచేశారు. ఇక రష్మిక ఈసినిమాకు అవసరం. తను మాత్రమే ఈ పాత్ర చేయగలదు. తను ఈ సినిమాలోకి, నా జీవితంలోకి రావడం నా అదృష్టం' అని అగ్ర కథానాయకుడు దేవరకొండ విజయ్ అన్నారు. ఆయన హీరోగా తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. రష్మిక మందన్న కథానాయిక. రాహుల్ సంకృత్యాన్ దర్శకుడు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై వై.రవిశంకర్, నవీన్ యెర్నేని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ పాన్ ఇండియా చిత్రం విజయదశమి కానుకగా ఈ నెల 16న విడుదల కానున్నది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో విజయ్ దేవరకొండ మాట్లాడారు. రష్మిక మదన్నా మాట్లాడుతూ 'మనకు తెలియని కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే సినిమా 'రణబాలి'. ఈ టీమ్ పడ్డ కష్టాన్ని ప్రత్యక్షంగా చూసిన వ్యక్తిని నేను. ఇది లవ్‌స్టోరీ కాకపోయినా.. ఇందులో లవ్‌ట్రాక్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది' అని చెప్పారు. విజయ్ దేవరకొండ విశ్వరూపం ఇందులో చూస్తారని డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ అన్నారు. ఇంకా చిత్రబృందంతో పాటు ప్రముఖ దర్శకులు హరీశ్‌శంకర్, శివ నిర్వాణ, వివేక్ ఆత్రేయ, బుచ్చిబాబు, రవికిరణ్ కోలా, రాహుల్ రవీంద్రన్ కూడా మాట్లాడారు.

# 'గరివిడి లక్ష్మి' ఓ భావోద్వేగ ప్రయాణం



ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ప్రముఖ జానపద గాయని గరివిడి లక్ష్మి జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'గరివిడి లక్ష్మి'. ఆనంది టైటిల్ రోల్‌ని పోషించారు. గౌరినాయుడు జమ్ము దర్శకుడు. పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానున్నది. మంగళవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. 'ఇది మా సంస్థ నుంచి వస్తున్న కొత్త ప్రయత్నం. ఇప్పటివరకూ సినిమా చూసినవారంతా మంచి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. ఈ సినిమాను ఇప్పటివరకూ ఓ పదిహేనుసార్లు చూసుంటాను. చూసిన ప్రతిసారీ అదే ఎమోషన్‌ని క్రియేట్ చేసింది. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. అందుకే ఒకరోజు ముందే ప్రీమియర్లు వేస్తున్నాం. ప్రభాస్‌గారితో త్వరలో ఓ సినిమా చేయబోతున్నాం' అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. సినిమా చూసినవారందరి కళ్లలో నీళ్లు చూసినప్పుడు ఈ కథ వారి హృదయాల్ని ఎంతగా కదిలించిందో అర్థమైందని, తన కెరీర్లోనే ఇది మోస్ట్ ఛాలెంజింగ్ క్యారెక్టర్ అని నటి ఆనంది చెప్పారు.

# జైలర్-2లో ఐటమ్ సాంగ్.. తమన్నా క్రేజ్ వస్తుందా?



ప్రస్తుతం సినిమాల్లో ప్రత్యేక పాటలు చిత్రాలకు ఓ ట్రెండ్‌గా మారాయనే చెప్పాలి. ఈ తరహా పాటలు యూత్‌ను బాగా ఎట్రాక్ట్ చేయడమే ఇందుకు ప్రధాన కారణం. ముఖ్యంగా స్టార్ హీరోల చిత్రాల్లో ప్రత్యేక పాటలు ట్రెండింగ్‌గా మారుతున్నాయనే చెప్పాలి. రజనీకాంత్ హీరోగా నటించిన జైలర్ చిత్రంలో నటి తమన్నా నటించిన నువ్వు కావాలయ్యా సాంగ్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. ఆ పాటలో మిల్కీ బ్యూటీ డ్యాన్స్‌తో అదరగొట్టింది. తాజాగా రజనీకాంత్ నటించిన జైలర్ 2 చిత్రం లో కూడా రెండు స్పెషల్ సాంగ్స్ ఉన్నాయి. ఇందులో ఒక పాటలో నటి పూర్ణ నటించారు. ఈ పాటను ఇటీవల విడుదల చేశారు. పాట బాగున్నా అనుకున్న రేంజ్‌లో రెస్పాన్స్ రాలేదు. అయితే ఇటీవల మరో ప్రత్యేక పాటను విడుదల చేశారు. దీన్ని పక్కా మాస్ మసాలా సాంగే అనాలి. ఇందులో కెనడాకు చెందిన నటి, మోడల్, డాన్సర్ గ్లామర్ డాల్ నోరా ఫతేరి నటించారు. గతంలో ఈ బాలీవుడ్ బ్యూటీ తమిళం, తెలుగు,మలయాళం, కన్నడం, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో ప్రత్యేక పాటల్లో, పాత్రల్లో నటించారు. ముఖ్యంగా తెలుగు చిత్రం బాహుబలి-- 1లో మనోహరి అనే పాటలో మరో ముగ్గురు భామలతో కలిసి నటించి బాగా గుర్తింపు పొందారు. కాగా తాజాగా జైలర్ 2 చిత్రంలో నటించిన బిందాస్ అనే పాటలో నోరా ఫతేరి అనే పాట యూట్యూబ్ ఛానళ్లలో హల్ చల్ చేస్తోంది. జైలర్ చిత్రంలో తమన్నా ఎలాగైతే అందాల మోత మోగించారో, అదేవిధంగా ఇప్పుడు నటి నోరా ఫతేరి కూడా ఏ మాత్రం ఒళ్లు దాచుకోకుండా బిందాస్ పాటలో నటించారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/